ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

గురువారం 13 నవంబరు 2025



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

గోపాలపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొనడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం విశాఖ చేరుకున్నారు. రాత్రి ఏడు గంటలకు ప్రత్యేక విమానంలో కడప నుంచి నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ ఎం.శ్రీభరత్, ప్రభుత్వ విప్‌లు పి.గణబాబు, వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, బండారు సత్యనారాయణమూర్తి వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్, మేయర్ పీలా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, పలు కార్పొరేషన్‌ల చైర్మన్లు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నగరానికి బయలుదేరి వెళ్లారు.

ఉప రాష్ట్రపతి రాక రేపు

- భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవానికి హాజరు



ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈ నెల 14వ తేదీన నగరానికి రానున్నారు. శుక్రవారం ఉదయం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 8.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి వెళతారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో కలిసి అల్పాహార విందులో పాల్గొంటారు. అనంతరం 8.55 గంటలకు 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరై ప్రసంగిస్తారు. 11.15 గంటలకు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం నుంచి బయలుదేరి ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడ నుంచి ఢిల్లీ వెళతారు. ఉప రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై బుధవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, సీపీ డాక్టర్ శంఖబ్రతబాగ్చి, ఉప రాష్ట్రపతి భద్రతా అధికారి సింగ్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఇతర అధికారులు సమీక్షించారు. ఇదిలావుండగా పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ మిశ్రాతో కలిసి ఏయూ మైదానంలో సదస్సు ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు మరో ఇద్దరు ఐఏఎస్‌లు

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భాగస్వామ్య సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు ప్రభుత్వం మరో ఇద్దరు ఐఏఎస్ అధికారులను నియమించింది. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, నెల్లూరు కలెక్టర్ హిమాన్షుశుక్లాలు ఈనెల 14, 15 తేదీల్లో పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్‌తో కలిసి ఈ విధులు నిర్వహిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

నగరం సర్వాంగ సుందరం

సీఐఐ సదస్సుకు ముస్తాబు

- రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు
- 26 రూట్లలో కొత్తరోడ్లు, పుత్‌పాత్‌లు, సెంటర్ మీడియన్లకు మరమ్మతులు
- పచ్చదనం పెంపు
- అతిథులు ప్రయాణించే మార్గాల్లోని కూడళ్లు అభివృద్ధి
- 16 బస్‌బేల ఆధునికీకరణ
- జీరో వేస్ట్ ఈవెంట్‌గా నిర్వహణకు జీవీఎంసీ ఏర్పాట్లు



సంపత్ వినాయకుని ఆలయం వద్ద విద్యుద్దీపాల వెలుగులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పెట్టుబడిదారుల సదస్సు నేపథ్యంలో నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జీవీఎంసీ అధికారులు సుమారు రూ.40 కోట్లు వెచ్చించి, అనేక అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టారు. వాటన్నింటినీ మంగళవారం నాటికి పూర్తిచేయడంతో నగరం కొత్తకళను సంతరించుకుంది.

నగరంలోని ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఈనెల 14, 15 తేదీల్లో సీఐఐ సదస్సు నిర్వహించాలని మూడు నెలల కిందట ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి హాజరయ్యే ప్రతినిధులను ఆకట్టుకునేలా ప్రాంగణం పరిసరాలను, రహదారులను సుందరంగా తయారుచేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు ఆదేశాలు అందాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, నగర ప్రజాప్రతినిధులు పలుమార్లు భేటీ అయి సదస్సు కోసం చేపట్టాల్సిన పనులకు సంబంధించి కార్యాచరణ రూపొందించారు. ప్రతినిధులు ప్రయాణించే మార్గాలు, సదస్సు అనంతరం సందర్శించే ప్రాంతాలు, వాటికి వెళ్లే మార్గాలను అభివృద్ధి



సుందరంగా తీర్చిదిద్దిన రైల్వే స్టేషన్ రోడ్డు

చేయాలని, పచ్చదనం పెంపొందించాలని, పెయింటింగ్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. దీనికోసం జీవీఎంసీ రూ.40 కోట్లు వరకూ కేటాయించింది. సదస్సు కోసం వచ్చే ప్రతినిధులు ప్రయాణించే మార్గాలను ఐదు కేటగిరీలుగా విభజించిన అధికారులు, 26 మార్గాల్లో 9.5 కిలోమీటర్ల మేర కొత్తగా బీటీ లేయర్‌ను వేశారు. 26.2 కిలోమీటర్ల మేర ఫుట్‌పాత్‌ల నిర్మాణం, రిపేర్లు, పెయింటింగ్ పనులు చేపట్టారు. 57 కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా కెర్బ్‌లు, సెంటర్ మీడియన్‌ల నిర్మాణం, రిపేర్లు, పెయింటింగ్‌లు పూర్తిచేశారు. 34.6 కిలోమీటర్లు పొడవున జాతీయ రహదారి, బీఆర్‌టీఎస్, నగర పరిధిలోని ప్రధాన మార్గాల్లో సెంటర్ మీడియన్ల రిపేర్లు, పెయింటింగ్ చేపట్టారు. 15 కిలోమీటర్లు పొడవున రోడ్లపై సెంటర్ మీడియన్లలో కొత్తగా గ్రిల్స్ ఏర్పాటుచేశారు. నగరంలోని రోడ్లకు ఇరువైపులా ఉన్న గోడలపై 6.9 కిలోమీటర్లు మ్యూరల్ ఆర్ట్‌లు, ఆలోచింపచేలా పెయింటింగ్‌లు వేశారు. 41 కిలోమీటర్లు పొడవున రోడ్లపై లేన్‌మార్కింగ్ చేశారు. నగర పరిధిలోని 16 బస్‌బేలను ఆధునికీకరించారు. కొత్తగా ఏడు వేల వీధి దీపాలను వేయడంతోపాటు ఆర్కే బీచ్ పరిసరాల్లో సముద్రతీరం, సముద్రపు అలలు సందర్శకులకు రాత్రిపూట కూడా స్పష్టంగా కనిపించేలా వెయ్యి వోల్టుల సామర్థ్యం కలిగిన హైమాస్ట్ లైట్లను ఏర్పాటుచేశారు. బీచ్‌రోడ్డుతోపాటు నగర పరిధిలోని ముఖ్యమైన రోడ్లు,

... మిగతా 6వ పేజీలో

2,200 మందితో బందోబస్తు



ఏయూ మైదానంలో కమాండ్‌కంట్రోల్‌రూమ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, డీసీపీ, ఇతర అధికారులు

- నిఘా కోసం 15 డ్రోన్లు, 155 సీసీ కెమెరాలు
- సభా ప్రాంగణంతోపాటు స్టార్ హోటళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు
- సదస్సు జరిగే ప్రాంగణంలో ప్రత్యేక కంట్రోల్‌రూమ్
- అస్త్రం యాప్‌తో ట్రాఫిక్ పర్యవేక్షణ
- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సుకు 2,200 మందితో బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్టు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి తెలిపారు. సదస్సు జరిగే ఏయూ ఇంజనీరింగ్ మైదానాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో

... మిగతా 6వ పేజీలో

కిడ్నీ రాకెట్

- తాజాగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేస్తుండగా జిల్లాకు చెందిన మహిళ మృతి
- దళారుల మాట నమ్మి మదనపల్లె వెళ్లిన ఆనందపురం ప్రాంతానికి చెందిన మహిళ
- ఆర్థిక అవసరాలున్న వారిని లక్ష్యంగా చేసుకుని వ్యాపారం



సాడి యమున (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరం కేంద్రంగా కిడ్నీ రాకెట్ నడుస్తూనే ఉంది. ఆర్థిక అవసరాలున్న వారిని గుర్తించడం, డబ్బు ఆశ చూపి వల వేయడం పరిపాటిగా మారింది. ఈ తరహా దందాకు పలువురు విశాఖను అడ్డాగా చేసుకోవడం ఆందోళనకు గురిచేస్తోంది. తాజాగా కిడ్నీ మాఫియాకు చిక్కి మహిళ ప్రాణాలు కోల్పోయిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం గ్రామానికి చెందిన సాడి యమున (29) మధురవాడలోని ఒక దుకాణంలో పనిచేస్తోంది. ఆమె భర్త తొమ్మిదేళ్ల కిందట మృతిచెందగా, మరొక వ్యక్తి, ఇద్దరు పిల్లలతో కలిసి మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీలో ఉంటోంది. ఆమెకు గాజువాక ప్రాంతానికి పద్మ పరిచయం ఏర్పడింది. పద్మతో పాటు మరొకరు కిడ్నీ రాకెట్‌లో దళారులుగా వ్యవహరిస్తున్నారు. యమున ఆర్థిక ఇబ్బందులను గుర్తించి కిడ్నీ ఇస్తే రూ.లక్షలు వస్తాయని ఆశచూపారు. కిడ్నీ మార్పిడి పూర్తయిన తరువాత రూ.8 లక్షలు చేతికి ఇస్తామని చెప్పి ఒప్పందం చేసుకున్నారు. యమున రెండు వారాల కిందట తిరుపతి అని చెప్పి..వారితో అన్నమయ్య జిల్లా మదనపల్లె వెళ్లింది. అక్కడ ఒక ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేస్తుండగా ప్రాణాలు కోల్పోయింది. ఈ విషయం బయటకు వస్తే ఇబ్బంది అవుతుందని అక్కడి ఆస్పత్రి యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా దళారుల ద్వారా

... మిగతా 6వ పేజీలో

సచివాలయాల్లో స్టేషనరీ కొరత

బిల్లు కడితే రశీదు ఉండదు...

- చివరకు సర్టిఫికెట్లు కూడా బయట ప్రింటు తీసుకోవాల్సిన పరిస్థితి
- కంప్యూటర్లు, ప్రింటర్ల మొరాయింపు
- ఇది సచివాలయాల తీరు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సచివాలయాలకు స్టేషనరీ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ డబ్బులు చెల్లించే ఏ వ్యవహారానికీ రశీదులు లభించడం లేదు. ఆఖరుకు ప్రభుత్వం జారీచేసే సర్టిఫికెట్లు కూడా బయటే ప్రింట్ తీసుకోవలసి వస్తోంది. సచివాలయ వ్యవస్థను మరింత విస్తృతంగా ఉపయోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్న తరుణంలో వాటి పనితీరును 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఇళ్ల యజమానులు అనేక మంది ఇంటి పన్ను, నీటి పన్ను కట్టడానికి జీవీఎంసీ జోనల్ కార్యాలయాలకు కాకుండా సచివాలయాలకే వస్తున్నారు.ఇక్కడ ఫోన్ పేతో చెల్లించుకోవచ్చు. నగదు అవసరం లేదు. అయితే వీటిని ప్రారంభించిన మొదట్లో ప్రతి చెల్లింపునకు కంప్యూటర్ ప్రింట్‌తో కూడిన రశీదు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రింటర్లు మూలకు చేరడంతో రశీదులు ఇవ్వడం లేదు. దానిపై వినియోగదారుల్లో తీవ్రమైన అసంతృప్తి ఉంది. అదేవిధంగా కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే

... మిగతా 6వ పేజీలో

సిబ్బంది లేక ఖాళీగా ఉన్న చైతన్యనగర్ సచివాలయం



ఇదీ పరిస్థితి...

- గ్రేటర్ 98వ వార్డు పరిధిలోని సచివాలయాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. మొత్తం ఏడు సచివాలయాల్లో గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులు ఇద్దరు మాత్రమే ఉన్నారు.
- సచివాలయాలను రీ గ్రూపింగ్ చేసి కస్టర్లుగా విభజించినా గోపాలపట్నం ప్రాంతాల్లో మార్పు కనిపించలేదు. సగం మంది సిబ్బంది ఫీల్డ్‌లోనే ఉంటున్నారు. ఆ బాధ్యత లేకుంటే సగానికి పైగా సిబ్బంది ఖాళీయే.
- 26, 43వ వార్డుల

... మిగతా 6వ పేజీలో

కాలక్షేపం చేసేవారే అధికం

- కొందరిపైనే పనిభారం...
- రేషనలైజేషన్ తర్వాత రెండు సచివాలయాలకు ఒకరే ప్లానింగ్, ఎమినిటీ కార్యదర్శులు
- వారిపై విపరీతమైన ఒత్తిడి

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయాల్లో కొందరు పనిభారంతో సతమతమవుతుంటే, మరికొందరు మాత్రం ఖాళీగా ఉంటున్నారు. జీవీఎంసీ పరిధిలో 572 వార్డు సచివాలయాలు ఉండగా, 4,386 మంది కార్యదర్శులు ఉన్నారు. ఇందులో 225 మంది వివిధ కారణాలతో విధులకు దీర్ఘకాలంగా హాజరుకావడం లేదు. వార్డు సచివాలయాల ఏర్పాటు సమయంలో ప్రతిచోట ఒక అడ్మిన్ సెక్రటరీ, వెల్ఫేర్ సెక్రటరీ, ఎడ్యుకేషన్ సెక్రటరీ, మహిళా పోలీస్, హెల్త్ సెక్రటరీ (ఏఎన్ఎం), వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీ, వార్డు ఎమినిటీస్ సెక్రటరీతోపాటు ప్రతి నాలుగు

... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీ పరిధిలో మొత్తం వార్డు సచివాలయాలు	572
మొత్తం కార్యదర్శులు	4386
వివిధ కారణాలతో విధులకు దీర్ఘకాలంగా గైర్హాజరవుతున్నవారు	225

పెరిగిన విమాన ప్రయాణికులు

- సెప్టెంబరులో 2,16,137 మంది
- అక్టోబరులో 2,43,701...



విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అక్టోబరు నెలలో ప్రయాణం చేసిన వారి సంఖ్య అంతకు ముందు నెల సెప్టెంబరుతో పోల్చుకుంటే కాసింత పెరిగింది. సెప్టెంబరులో 1,694 విమాన రాకపోకలు జరగ్గా వాటి ద్వారా 2,16,137 మంది ప్రయాణించారు. అక్టోబరులో విమానాల రాకపోకల సంఖ్య 1730కి పెరిగింది. దాంతో ప్రయాణికుల సంఖ్య కూడా 2,43,701గా నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి చూసుకుంటే అక్టోబరు నెలాఖరు వరకు మొత్తం 12,359 విమానాల రాకపోకలు జరగ్గా, వాటి ద్వారా 16,50,797 మంది ప్రయాణించారు. వీరిలో విశాఖకు వచ్చిన వారి సంఖ్య 8,43,957 కాగా, విశాఖ నుంచి వెళ్లిన వారి సంఖ్య 8,06,840.

అంతర్జాతీయ రాకపోకలు

విశాఖపట్నం నుంచి అక్టోబరు నెలలో 79 అంతర్జాతీయ విమానాల రాకపోకలు జరగ్గా వాటి ద్వారా 9,476 మంది ప్రయాణించారు. వారిలో విశాఖపట్నం వచ్చిన వారి సంఖ్య 5,017 కాగా

... మిగతా 6వ పేజీలో

గాజువాక ఎంఈవో-1 సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్జేడీ

గాజువాక, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అధికారాన్ని దుర్వినియోగం చేయడంతోపాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై గాజువాక మండల విద్యాశాఖాధికారి-1 బి.విశ్వనాథంను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ్‌భాస్కర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన గాజువాకలో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పలు అవకతవకలకు పాల్పడడంతో పాటు ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో బాధితులు టీచర్స్ యూనియన్ నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు ఎంఈవో-1తో చర్చించినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో డీఈవో ద్వారా ఆర్జేడీకి ఫిర్యాదు చేశారు. ఆరోపణలపై విచారణ చేపట్టగా మహిళా ఉపాధ్యాయులపై వేధింపులు, నిధుల వినియోగంలో నిర్లక్ష్యం, మృతిచెందిన ఉపాధ్యాయులకు సంబంధించి ప్రయోజనాల ప్రతిపాదనలు ఆలస్యంగా పంపడం వంటివి చేసినట్టు తేలింది. దర్యాప్తు నివేదిక ఆధారంగా ఎంఈవోను సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ ఉత్వరులు ఇచ్చారు. కాగా విశ్వనాథం గతంలో చోడవరం మండల ఎంఈవోగా పనిచేసినప్పుడు నిధుల దుర్వినియోగం చేయడంతో అప్పుడు కూడా సస్పెన్షన్‌కు గురయినట్టు తెలిసింది.

పేదలకు గృహయోగం

జిల్లాలో 38,691 ఇళ్లలో ప్రవేశాలు

- పీఎంఏవై 2.0 కింద మంజూరైన ఇళ్లకు శంకుస్థాపనలు

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో పేదల కోసం నిర్మించిన ఇళ్లలో బుధవారం గృహప్రవేశాలు జరిగాయి. అర్హులైన వారి కోసం నగర శివార్లలో రూపొందించిన లేఅవుట్‌లలో ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు నిర్మించింది. అలాగే సొంతంగా స్థలాలు కలిగి ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షలు మంజూరు చేసింది. ఈ విధంగా కాలనీల్లో, వ్యక్తిగత స్థలాల్లో చేపట్టిన ఇళ్లలో 38,691 వరకూ పూర్తయ్యాయి. వాటిలో బుధవారం గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారులకు అధికారులు పత్రాలు అందజేశారు. ఇందులో

... మిగతా 6వ పేజీలో



పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో లబ్దిదారులకు పత్రాలు అందజేస్తున్న ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయులు. చిత్రంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీ కోపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి ఉన్నారు.



వేలం నిర్వహిస్తున్న జడ్సీ అయ్యప్పనాయుడు, అధికారులు

దుకాణాల వేలానికి విశేష స్పందన

భీమునిపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెయిన్ రోడ్‌లో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని 11 దుకాణాలకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. మూడేళ్ల కాల పరిమితికి నెలవారీ అద్దె ప్రాతిపదికన ఈ వేలం జరిపారు. 11వ నంబరు దుకాణానికి అత్యధికంగా రూ. 40 వేలు అద్దె పలకగా, అత్యల్పంగా 4వ నంబరు దుకాణానికి రూ. 25 వేలు లభించింది. జోనల్ కార్యాలయంలో జడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలానికి కార్యాలయం సూపరింటెండెంట్ సారిపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఒక్కో దుకాణానికి జీవీఎంసీ తొలుత రూ. 12 వేలు అద్దె చెప్పగా, పాటదారులు పోటాపోటీగా పాట పాడారు.

సింహగిరిపై వన భోజనాలు

సింహాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి దేవళంలో సనాతన సంప్రదాయానికి గుర్తుగా వన భోజనాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఏటా మాదిరిగానే బుధవారం సింహగిరిపై కల్యాణ మండపంలో దేవస్థానం ఆధ్వర్యంలో వన భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్. సుజాత, ఏఈఓలు, పలు విభాగాల పర్యవేక్షణాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'గీతం'లో పెన్‌స్టేట్ వర్సిటీ బృందం

సాగర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని పెన్‌స్టేట్ విశ్వవిద్యాలయం అకడమిక్ నిపుణుల బృందం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా వారు వర్సిటీలోని పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావుతో భేటీ అయ్యారు.

వాటర్ ట్యాంకుకు మెట్ల నిర్మాణం

భీమునిపట్నం (రూరల్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడివాడ పంచాయతీ ఎరుసుపేట గ్రామంలో రక్షిత మంచినీటి పథకం మెట్ల నిర్మాణానికి సర్పంచ్ చిల్ల జమున బుధవారం శంకుస్థాపన చేశారు. ట్యాంకుకు గతంలో నిర్మించిన మెట్లు శిథిలం కావడంతో నూతన మెట్ల నిర్మాణానికి దివీస్ కంపెనీ రూ.4.50 లక్షలు మంజూరు చేసింది. ఈమేరకు సర్పంచ్ ప్రత్యేక పూజలు చేసి, పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దివీస్ సీఎస్ఆర్ మేనేజరు సురేశ్‌కుమార్, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

పెరిగిన విమాన ప్రయాణికులు

... 5వ పేజీ తరువాయి

విశాఖ నుంచి వెళ్లినవారు 4,459 మంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు చూసుకుంటే మొత్తం 471 విమానాలు రాకపోకలు సాగించగా, వాటి ద్వారా 59,115 మంది ప్రయాణించారు. మొత్తం చూసుకుంటే ఏప్రిల్ నుంచి అక్టోబరు నెలాఖరు వరకు డొమెస్టిక్, అంతర్జాతీయ ప్రయాణం చేసినవారు 17,09,912 మందిగా నమోదైనట్టు విమానాశ్రయం వర్గాలు తెలిపాయి.

పేదలకు గృహయోగం

... 5వ పేజీ తరువాయి

లబ్ధిదారులు స్వయంగా నిర్మించుకున్నవి 38,389 ఇళ్లు. ఈ సందర్భంగా పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొని లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గృహ ప్రవేశాలు చేసిన ఇళ్లలోకి మంత్రి, ఇతర నాయకులు వెళ్లి లబ్ధిదారులతో ముచ్చటించారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, హౌసింగ్ పీడీ సీహెచ్ సత్తిబాబు, ఇతర అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. కాగా పీఎంఏవై 2.0లో కొత్తగా మంజూరుచేసిన ఇళ్లకు సంబంధించి పెందుర్తి పరిధిలో 69వ వార్డులో శంకుస్థాపనలు చేశారు. ఇంకా గాజువాక, విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు పత్రాలు అందజేశారు.

నగరం సర్వాంగ సుందరం

... 5వ పేజీ తరువాయి

సెంటర్ మీడియన్లు, కూడళ్లలో ఆకట్టుకునేలా అందమైన పూలమొక్కలను నాటి పచ్చదనం అభివృద్ధి చేశారు. నగరంలోని ముఖ్యమైన రోడ్లపై ఉన్న కూడళ్లలో సర్కిల్స్‌ను నిర్మించి వాటిలో వాటర్ ఫౌంటెయిన్లు, ఆకట్టుకునేలా కళాకృతులను ఏర్పాటుచేశారు. వీటన్నింటి నేపథ్యంలో నగరానికి కొత్తశోభ వచ్చి రాత్రిపూట మరింత అందంగా కనిపిస్తోంది.

జీరో వేస్ట్ ఈవెంట్‌గా గుర్తింపు కోసం కార్యాచరణ

సీఐఐ సదస్సులో చెత్త అనేది లేకుండా చేయడం ద్వారా దేశంలోనే మొదటి జీరో వేస్ట్ ఈవెంట్‌గా గుర్తింపుపొందాలని జీవీఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది. సదస్సు జరిగే రెండురోజులు ప్రాంగణంలో సింగిల్ యూజ్‌ప్లాస్టిక్ అనేది లేకుండా ఎకో ఫ్రెండ్లీ వస్తువులనే వాడాలని నిర్ణయించారు. అతిథులు టీ, కాఫీ తాగేందుకు కప్పులను ప్రత్యేకంగా రాగిపిండితో తయారుచేశారు. టీ తాగేసిన తర్వాత కప్పులను తినేయాలని సూచిస్తారు. అలాగే ప్రతినిధులకు ప్లాస్టిక్ బాటిళ్లతో కాకుండా మట్టితో తయారుచేసిన వాటితో తాగునీరు అందించబోతున్నారు. భోజనం ప్లేట్లు, టిష్యూ పేపర్లు వంటివి ఉన్నాసరే వాటిని అక్కడికక్కడే రీసైక్లింగ్ చేసేలా ఏర్పాటుచేస్తున్నారు. పొడిచెత్తను వేరుచేసి అక్కడికే వ్యాపారులు వచ్చి కొనుక్కొని వెళ్లేలా వెసులుబాటు కల్పించనున్నారు. తడిచెత్తను కూడా ప్రాంగణంలోనే రీసైక్లింగ్ చేసేలా ప్రత్యేకంగా కంపోస్ట్ యూనిట్‌ను ఏర్పాటుచేశారు. సదస్సు జరిగే రెండు రోజులు ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణకు జీవీఎంసీ అధికారులు మూడు షిఫ్టుల్లో కార్మికులను సిద్ధం చేశారు.

2200 మందితో బందోబస్తు

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ నగరంతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి అధికారులు, సిబ్బంది సేవలను వినియోగించుకుంటున్నామన్నారు. ఢిల్లీ ఘటన నేపథ్యంలో సదస్సు జరిగే ప్రాంగణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ఒక త్రెడ్ డ్రోన్, 15 డ్రోన్లతో నిరంతర నిఘా ఏర్పాటుచేశామన్నారు. ఇవికాకుండా 155 సీసీ కెమెరాలను ప్రాంగణంలోని కీలక ప్రాంతాల్లో అమర్చామన్నారు. వీటన్నింటినీ పర్యవేక్షించేందుకు సదస్సు జరిగే ప్రాంగణంలోనే ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేశామన్నారు. ప్రధాన వేదికతోపాటు, హెలీపాడ్, వీఐపీలు సమావేశమయ్యే హాళ్లు, గదులు, మంత్రుల సమావేశాలు జరిగే ప్రాంతాలు, భోజనశాలలను ఇప్పటికే బాంబుస్క్వాడ్‌లు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టామన్నారు. వీటితోపాటు ప్రముఖులు, సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు బస చేసే హోటళ్లలో కూడా భద్రతాపరమైన తనిఖీలు నిర్వహించామన్నారు.సిబ్బందికి 200 బాడీవార్న్ కెమెరాలు అందజేశామన్నారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాల్లో ట్రాఫిక్ పర్యవేక్షణకు 'అస్త్రం' యాప్‌ను వినియోగించుకుంటామన్నారు. ట్రాఫిక్‌జామ్ కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



భీమిలిలోని కృష్ణాకాలనీలో వార్డు సచివాలయం



సింహాచలంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

సచివాలయాల్లో సిబ్బంది కొరత

- అమలు కాని రీ గ్రూపింగ్
- ఉన్నవారిపై పని భారం
- పని చేయని కంప్యూటర్లు
- కానరాని స్టేషనరీ సామగ్రి

భీమునిపట్నం,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భీమిలి జోన్ పరిధిలో ఉన్న సచివాలయాల్లో ఎక్కడా ప్రభుత్వం ప్రతిపాదించిన రీగ్రూపింగ్ అమలు కాలేదు. భీమిలిలో 1 నుంచి 3 వార్డులకు 15 సచివాలయాలు, విలీన గ్రామాలతో కూడిన 4వ వార్డులో ఆరు సచివాలయాలు ఉన్నాయి. 1 నుంచి 3 వార్డుల్లో 110 మంది సిబ్బంది, 4వ వార్డులో 34 మంది పనిచేస్తున్నారు. ఒక్కొక్క సచివాలయానికి 9 మంది సిబ్బంది ఉన్నారు. మొత్తంగా 15 వార్డు సచివాలయాల్లు 135 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 110 మంది మాత్రమే పని చేస్తున్నారు.అలాగే నాలుగో వార్డులోని ఆరు సచివాలయాల్లో 54 మందికి 34 మంది ఉన్నారు. అన్ని సచివాలయాల్లోనూ సిబ్బంది ఉంది. ఏ ఒక్క సచివాలయంలోనూ సిస్టమ్స్ గాని, ప్రింటర్లు గాని పనిచేయడం లేదు. దీనివల్ల ప్రజలకు సకాలంలో సేవలందించడంలో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలాచోట్ల సిబ్బంది వ్యక్తిగత సెల్‌ఫోన్‌లలోనే పనులు చేస్తున్నారు. అలాగే స్టేషనరీ సమస్య కూడా ఉంది. కాగా జనగణనకు 1, 2 వార్డులు మాత్రమే ఎంపికయ్యాయి. ఇక్కడి సర్వేకు సచివాలయాల సిబ్బందిని వినియోగిస్తున్నారు. ప్రతి ఇంటికి ప్రతి ఇంటి నెంబరును వరుస క్రమంలో నమోదు చేయడంలో సచివాలయం అడ్మిన్ సెక్రటరీలు విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారు. వీటితో పాటు ఆస్తి పన్ను ప్రస్తుతం ఎంత ఉందని పరిశీలించడం, అదనపు నిర్మాణాలు జరిగితే పన్ను వేయడం, ఇతర అండర్ అసెస్మెంట్ పనులు కూడా చేపడుతున్నారు. అలాగే, ఫీల్డ్ డిపార్టుమెంట్‌కు సంబంధించిన అడ్మిన్ సెక్రటరీలు, ఎమినిటీస్ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలు కూడా పని ఒత్తిడికి గురవుతున్నారు. సిబ్బంది కొరత, పని ఒత్తిడి, సిస్టమ్స్ పనిచేయకపోవడంతో సమస్యలతో సతమతమవుతున్నారు.

సింహాచలంలో...

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డులోని సచివాలయాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. వార్డు పరిధిలో 524 నుంచి 530 వరకు ఏడు సచివాలయాలు ఉన్నాయి. అన్నిచోట్లా సిబ్బంది తక్కువగానే ఉన్నారు. రెవెన్యూ విభాగానికి చెందిన గ్రేడ్-2 రెవెన్యూ అధికారులు (వీఆర్‌ఓలు) అన్ని సచివాలయాకు కలిపి ఇద్దరు మాతమే ఉన్నారు. దీంతో ధృవీకరణ పత్రాలు పొందేందుకు ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

మధురవాడలో...

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు దుర్గానగర్ సచివాలయం పరిధిలో 4,200 మంది ప్రజలకు సేవలందిస్తున్నారు. ఇక్కడ రీగ్రూపింగ్ తరువాత ఎనిమిది మంది ఉండాలి. కానీ ప్రస్తుతం ఐదుగురు పని చేస్తున్నారు. ప్లానింగ్ సెక్రటరీ, వీఆర్వోలు డెప్యుటేషన్‌పై ఇతర సచివాలయాలకు వెళ్లారు. ఎడ్యుకేషన్ కార్యదర్శి మెటర్నటీలీవ్‌లో ఉన్నారు. వుమెన్ ప్రొటెక్షన్ సాధారణ లీవ్‌లో ఉన్నారు. శానిటేషన్ సిబ్బంది విధుల నిర్వహణకు బయటకు వెళ్లారు. అడ్మిన్ కార్యదర్శి, వెల్ఫేర్ కార్యదర్శి, ఆరోగ్య కార్యదర్శి విధుల్లో ఉన్నారు. రీగ్రూపింగ్ తరువాత ఉన్న సిబ్బందితోనే ప్రజలకు సేవలందిస్తున్నారు. డెప్యుటేషన్‌పై వెళ్లిన వీఆర్వో, ప్లానింగ్ కార్యదర్శి పనులను ఉన్న సిబ్బంది సర్దుకొని సేవలందిస్తున్నారు.



మధురవాడలోని దుర్గానగర్ సచివాలయం

రీ గ్రూపింగ్ అమలు కాలేదు

పద్మనాభం రూరల్ : మండలంలో ఎక్కడా రీ గ్రూపింగ్ అమలు కాలేదు. అనంతవరం, కొవ్వాడ, రెడ్డిపల్లి, పొట్నూరు. తునివలస సచివాలయాల్లో పాత పద్ధతి ప్రకారమే సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

- మంత్రి డోలా, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పద్మనాభం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు ఆశయ సాధన మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలందరికీ సొంతిళ్లు సమకూర్చేందుకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన రెడ్డిపల్లి పంచాయతీలో ఎన్‌టీఆర్ గృహాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటైన 16 నెలల్లో 3 లక్షల గృహాలను పేదలకు అందించామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో 2029 నాటికి ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని చెప్పారు. గత 16 నెలల్లో రాష్ట్రంలో పీఎంఏవై కింద 2,13,180 గృహాలను, పీఎంఏవై (జి) పథకం కింద 66,397 గృహాలు, పీఎంజేఎం కింద 5,980 గృహాలు పేదలకు నిర్మించామని తెలిపారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడం ద్వారా మరో 3 లక్షల గృహాలను పేదలకు అందించినట్టు పేర్కొన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, గండి బాబ్జీ, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ సత్తిబాబు, పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు, టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ, మాజీ ఎంపీపీలు లీలవతి, కాళ్ల నగేశ్‌కుమార్, భీమిలి ఏఎంసీ డైరెక్టర్ వాల్ల నందిని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల వెంకట సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు (అన్నమయ్య), శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.95 కోట్లు

సింహాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులు గత 28 రోజులుగా హుండీలలో సమర్పించిన కట్నకానుకల ద్వారా సుమారు రూ.1.95 కోట్ల ఆదాయం సమకూరింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్.సుజాత పర్యవేక్షణలో బుధవారం పరకామణి కేంద్రంలో హుండీలను తెరిచి ఆదాయాన్ని లెక్కించారు. ఇందులో రూ.1,95,27,442 నగదు, 83.1 గ్రాముల స్వర్ణం, 11.2 కిలోల రజితం ఆభరణాల రూపంలో స్వామిఖజానాకు లభించాయి. అదేవిధంగా 192 యూఎస్ఏ డాలర్లు, 100 ఒమన్ కరెన్సీ, 140 యూరోలు, 65 కెనడా డాలర్లు, 13,030 యూఏఈ దీరమ్స్, ఏడు సింగపూర్ డాలర్లు, 11 ఖతార్ రియల్స్, మలేషియా, నేపాల్, టర్కీ, భూటాన్, శ్రీలంక, ఆస్ట్రేలియా, తదితర దేశాల కరెన్సీ లభించింది. హుండీల లెక్కింపునకు ప్రత్యేక పరిశీలకుడిగా దేవదాయశాఖ అధికారి శ్రీధర్ హాజరయ్యారు. సింహాచలం ఏఈవోలు, పర్యవేక్షణాధికారులు, ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్, శ్రీహరి సేవా సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణసేవ ప్రారంభం

ఆనందపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కణమాం పంచాయతీలో స్థానిక అయ్యప్ప పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నారాయణసేవ (నిత్యాన్నదాన) కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పలరాము, మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఘట్టమనేని బోసుబాబు, గంట్రెడ్డి స్వామినాయుడు, శ్రీకాంత్ రాజు, బీఆర్‌బీ నాయుడు, చంటి పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న సినీ నటులు

సింహాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సంతాన ప్రాప్తిరస్తు సినిమా హీరో, హీరోయిన్ విక్రాంత్, చాందినీ చౌదరి బుధవారం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న వారి గోత్రనామాలతో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు అంతరాలయంలో స్వామివారిని దర్శించు కుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ సంతాన ప్రాప్తిరస్తు సినిమా శుక్రవారం విడుదల కానున్నట్టు చెప్పారు.



రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆనందపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు అన్నారు. బుధవారం ఆయన ఆనందపురం, వేములవలస, శొంఠ్యాం పీఏసీఎస్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకులు రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సహకార సంఘాల అధ్యక్షులు గంట్రెడ్డి స్వామినాయుడు, రౌతు నాగరాజు, పాండ్రంకి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభుని సన్నిధిలో కోన తాతారావు, తదితరులు

పద్మనాభం రూరల్ : పద్మనాభం పీఏసీఎస్‌కు సొంత భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తే నిధులు మంజూరు చేస్తామని డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు హామీ ఇచ్చారు. ఆయన పద్మనాభం సహకార సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం పనితీరు, ఇతర అంశాలను సీఈవోను అడిగి తెలుసుకున్నారు. అంతకముందు అనంత పద్మనాభస్వామిని దర్శించుకున్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపర్చుకోవాలి

భీమునిపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఛాత్రోపాధ్యాయులు కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపర్చుకోవాలని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రటరీ, ఎస్ఐఈఎంఏటీ డైరెక్టర్ మస్తానయ్య అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని డైట్ కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఛాత్రోపాధ్యాయుల పాత్ర కీలకమని, ప్రతి ఛాత్రోపాధ్యాయుడు సాంకేతికను అందిపుచ్చుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై కూడా పట్టు సాధించాలన్నారు. అనంతరం అధ్యాపకులతో సమావేమయ్యారు.

పీపీపీ విధానంపై వైసీపీ ఆందోళన

భీమునిపట్నం/పద్మనాభం/తగరపువలస, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలల ప్రైవేటీకరణ కూటమి ప్రభుత్వం కుట్ర అని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం పార్టీ శ్రేణులు వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తొలుత ర్యాలీగా కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఆర్థిక లావాదేవీలు జరిపిన వారికి, తమ అనుచరులకు మెడికల్ కాలేజీలను అప్పనంగా కట్టబెట్టే చర్యల్లో భాగమే పీపీపీ పద్ధతి అని దుయ్యబట్టారు. పేద వర్గాలకు వైద్యాన్ని, విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. అనంతరం హెచ్‌డీటీ బీఎస్ఎస్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎంపీపీ దంతులూరి వాసురాజు, 4వ వార్డు కార్పొరేటర్ ఏడు కొండలరావు, భీమిలి వైసీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు, అక్కరమాని రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు. కాగా పద్మనాభం, తగరపువలస నుంచి భీమిలి వరకు వైసీపీ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ రెండో వార్డు అధ్యక్షుడు భాస్కరరెడ్డి, ఎ. మంగరాజు, జీరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో తగరపువలసలోనూ, పద్మనాభంలో పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణరావు, ఎంపీపీ రాంబాబు, తదితరులు ఆధ్వర్యంలోనూ ర్యాలీ జరిగింది.



డీటీ ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



స్థానికులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జగదీశ్వరరావు

కల్లివానిపాలెంలో అతిసార

- తొమ్మిది మందికి వాంతులు, విరోచనాలు

భీమునిపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 4వ వార్డు కాపులుప్పాడ పంచాయతీ కల్లివానిపాలెం గ్రామంలో అతిసార ప్రబలింది. తొమ్మిది మంది వాంతులు, విరోచనాలతో బాధపడడంతో వైద్యులకు, జడ్సీ అయ్యప్పనాయుడుకు ఆ గ్రామ జడ్పీటీసీ మాజీ సభ్యుడు, టీడీపీ సీనియరు నాయకుడు బోర బంగారురెడ్డి, బోర రాధాకుమారి సమాచారం అందించారు. ఈమేరకు చేపలుప్పాడ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసరు డాక్టర్ కల్యాణ్ చక్రర్తి, భీమిలి సీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ కల్యాణి బుధవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. డీఎంహెచ్‌ఓ జగదీశ్వరరావు కూడా గ్రామానికి చేరుకుని పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పరిస్థితి విషమంగా ఉన్న గుడ్ల వెంకటలక్ష్మి (33), పావని (20), నరగడ సౌమ్య (17), గుడ్ల నీలిమ (22)ను కొమ్మాది గాయత్రి ఆస్పత్రికి తరలించారు. మరో ఏడుగురు ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. శనివారం రాత్రి గ్రామంలో కొందరు మాలధారణ స్వాములు పూజలు చేశారు. వారు నగరం నుంచి టిఫిన్స్ తెప్పించారు. ఆ ఆహారం, తాగునీరు కలుషితం వల్ల అతిసార ప్రబలినట్టు అధికారులు చెబుతున్నారు.

ఆకర్షణీయంగా సింహాచలం ప్రధాన కూడలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నరసింహం

సింహాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సీఐఐ సదస్సుల అభివృద్ధి పనుల్లో భాగంగా సింహాచలం ప్రధాన కూడలిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. విమానాశ్రయంలో దిగే ప్రతినిధులు సదస్సులకు సింహాచలం బీఆర్‌టీఎస్ కారిడార్‌లో ప్రయాణించనుండడంతో జీవీఎంసీ రూ. 2 కోట్లతో రెండు కిలోమీటర్ల మేర సుందరీకరణ పనులు చేపడుతోంది. డివైడర్లను విద్యుత్ దీపాల అలంకరణతో పాటు సింహాచలం ప్రధాన కూడలిలో గ్రామీణ వాతావరణం, ఆధ్యాత్మిక భావం ప్రతిబింబించే విధంగా పలు బొమ్మలను చిత్రీకరించారు. అలాగే ఐ లవ్ సింహాచలం పేరుతో ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

సచివాలయాల్లో స్టేషనరీ కొరత

... 5వ పేజీ తరువాయి

సచివాలయం సిబ్బంది వచ్చి వెరిఫై చేస్తారు. అవి మంజూరైన తరువాత ఇంతకు ముందు సచివాలయాల్లోనే ప్రింట్ తీసి ఇచ్చేవారు. ఇప్పుడు వాటిని మీ-సేవా కేంద్రాలకు వెళ్లి తీసుకోవలసి వస్తోంది. వీటిపై ఎంతమంది ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండడం లేదు.

కాలక్షేపం చేసేవారే అధికం

... 5వ పేజీ తరువాయి

సచివాలయాలకు ఒకరు చొప్పున వీఆర్‌ఓలను నియమించారు. మూడు నెలల కిందట వార్డు సచివాలయాల్లో సిబ్బందిని రేషనలైజేషన్ చేశారు. ప్లానింగ్, ఎమినిటీస్ సెక్రటరీలకు రెండేసి వార్డు సచివాలయాల బాధ్యతలను అప్పగించారు. వార్డు సచివాలయంలో మహిళా పోలీసులు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ఆకతాయిలు, పేకాటరాయుళ్లు, వ్యభిచారం, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు విక్రయం, వినియోగం, రవాణా వంటివాటికి సంబంధించిన సమాచారం సేకరించాల్సి ఉంటుంది. అలాగే చోరీల నియంత్రణకు తీసుకోవాల్సి జాగ్రత్తలు, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి బాధ్యతలను చూడాల్సి ఉంటుంది. అయితే కొద్దిమంది మినహా మహిళా పోలీసులు ఎవరూ ఆ బాధ్యతలను నిర్వర్తించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే వార్డు శానిటేషన్ సెక్రటరీలు తమకు కేటాయించిన ప్రాంతంలో ఉదయం ఆరు నుంచే తిరుగుతూ గెడ్డల నిర్వహణ, చెత్త సేకరణ, క్లాప్ వాహనాల పనితీరు, పారిశుధ్య సిబ్బంది హాజరు పరిశీలించాల్సి ఉంటుంది. కానీ కొద్దిమంది మాత్రమే ప్రభుత్వం నిర్దేశించిన జాబ్‌చార్ట్ ప్రకారం పనిచేస్తున్నారని, మిగిలినవారు మాత్రం పట్టించుకోనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వార్డు ఎమినిటీ, ప్లానింగ్ సెక్రటరీలతోపాటు హెల్త్ సెక్రటరీలకు మాత్రం పనిభారం ఎక్కువగా ఉంటోందని చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి...

... 5వ పేజీ తరువాయి

పరిధిలోని 241, 243 సచివాలయాలను ఇన్‌చార్జులతో నెట్టుకొస్తున్నారు. సిబ్బంది లేక ప్రజలకు అందించాల్సిన సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. మూడు నెలలుగా కంప్యూటర్లు పనిచేయడం లేదు.

- జీవీఎంసీ 54వ వార్డు దుర్గానగర్ సచివాలయంలో వీఆర్వో, శానిటరీ సెక్రటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్టేషనరీ కొరత ఎక్కువగా ఉంది. కంప్యూటర్స్ పనిచేయడం లేదు.
- పెందుర్తి పరిధిలో రీగ్రూపింగ్ చేసిన తరువాత కొంతమందిపై పని భారం పెరిగింది. మరికొంతమందికి అసలు పని లేకుండా పోయింది.
- మహారాణిపేట పరిధిలోని సచివాలయాల్లో ప్రింటర్లు, కంప్యూటర్లు మూలకు చేరాయి. ధ్రువపత్రాలు, ఇతర సర్టిఫికెట్లు బయట ప్రింట్ తీసుకోవాలని సిబ్బంది సూచిస్తున్నారు.

కిడ్నీ రాకెట్

... 5వ పేజీ తరువాయి

మృతదేహాన్ని విశాఖకు తరలించేందుకు ఏర్పాట్లుచేసింది. ఈ విషయం యమునతో సహజీవనం చేస్తున్న వ్యక్తికి తెలియడం, అదే సమయంలో దళారుల మధ్య వివాదం తలెత్తడంతో పోలీసుల దృష్టికి వెళ్లింది. పోలీసులు ప్రాథమిక విచారణ జరిపి దళారులుగా వ్యవహరించిన పద్మ, సూరిబాబు, సత్యతోపాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దళారుల్లో ఇద్దరు విశాఖకు చెందినవారిగా చెబుతున్నారు. వారే ఆమెను దగ్గరుండి మదనపల్లె తీసుకువెళ్లారు. ఈ కిడ్నీ మార్పిడి ఒప్పందంలో గాజువాక ప్రాంతానికి చెందిన దళారి పద్మ కీలకంగా వ్యవహరించినట్టు చెబుతున్నారు.

యథేచ్ఛగా సాగుతున్న దందా..

మూడేళ్లలో ఈ తరహా దందాలు ఎన్నో వెలుగులోకి వచ్చాయి. రెండేళ్ల కిందట కిడ్నీ ఇస్తే సుమారు రూ.పది లక్షలు ఇస్తామని చెప్పి మధురవాడ వాంబే కాలనీకి చెందిన ఒక డ్రైవర్‌ను దళారులు నమ్మించారు. పెందుర్తిలోని ఒక క్లినిక్‌లో కిడ్నీ తీసుకుని, రూ.2.5 లక్షలు చేతిలో పెట్టారు. డబ్బులు పూర్తిగా ఇవ్వకపోగా కిడ్నీ మార్పిడి అనంతరం అనారోగ్యం పాలైనప్పటికీ పట్టించుకోకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. శస్త్రచికిత్స నిర్వహించిన ఆస్పత్రికి కనీసం అనుమతి కూడా లేదని అధికారులు విచారణలో తేలింది. అలాగే రెండున్నరేళ్ల కిందట వాంబే కాలనీకి చెందిన మరో మహిళకు డబ్బు ఆశ చూపించి కిడ్నీ అమ్మేశారు. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. ఆర్థిక లావాదేవీల్లో తేడాలు రావడంతో మాత్రమే ఇవన్నీ బయటకు వస్తున్నాయి. కానీ, బయటకు రాకుండా గుట్టుగా సాగిపోతున్నవెన్నో ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ తరహా ముఠాలపై ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసులు గట్టిగా దృష్టి సారించాల్సి ఉంది.

రుషికొండ బీచ్ రోడ్డులో ఆక్రమణలు తొలగింపు

సాగర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌కు వెళ్లే రోడ్డుపై ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను పట్టణ ప్రణాళికా విభా గం సిబ్బంది బుధవారం తొలగించారు. సీఐఐ సదస్సుకు ప్రతినిధులు బీచ్ రోడ్డును సందర్శించే అవకాశం ఉండడంతో ఆక్రమణలను తొలగిస్తున్నట్టు ఆ శాఖాధికారులు తెలిపారు.

28వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా కనకరాజు



రామ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 28వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా నక్కా కనకరాజు నియమితులయ్యారు. ఈ మేరకు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం కనకరాజును పార్టీ వార్డు అధ్యక్షుడిగా ప్రకటించారు. రామ్‌నగర్ వాసి అయిన కనకరాజు అనేక సంవత్స రాలుగా తెలుగుదేశం పార్టీ కోసం సేవలు అందిస్తూ ఉన్నారు. రాజకీయ అనుభవం ఉంది. గతంలో పార్టీ వార్డు అధ్యక్షుడిగా, జిల్లా నాయకుడిగా పలు హోదాల్లో పని చేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీ గెలుపునకు విశేష కృషి చేశారు. పార్టీకి తాను అందిం చిన సేవలను గుర్తించి తనకు ఈ పదవి కట్టబెట్టిన ఎమ్మెల్యే వెలగపూడికి కనకరాజు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు తన వంతు సేవలు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కనకరాజుకు అభినందనలు తెలియజేశారు.

కాలువలో టైల్స్

- మురుగు పారని పరిస్థితి
- పట్టించుకోని అధికారులు



మురుగు పారే అవకాశం లేకుండా కాలువలో ఉంచిన టైల్స్

ఆరిలోవ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల సంతపాలెంగ్రామానికి రహదారి, అలాగే మండల ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడకు అనుకొని ఉన్న ప్రధాన కాలువల్లో కొందరు టైల్స్ వేసి వదిలేశారు. దీంతో కాలువ పూర్తిగా మూసుకుపోయి మురుగునీరు ప్రవహించే అవకాశమే లేకుండా పోతోంది. అయినప్పటికీ జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో మురుగు ప్రవహించేఅవకాశం లేక దోమలు, దుర్గంధం వ్యాప్తి చెందుతోంది. దీని వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలోఉంచిన టైల్స్ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సినిమా గైడ్

- **ది గర్ల్ ఫ్రెండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **జటాధర** : శారదా, శ్రీకన్య
- **బ్యాడ్ ల్యాండ్స్/ఫెనిక్స్** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : వెంకటేశ్వర-1.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా30, వంకాయలు (తెలుపు) 58, వంకాయలు (నలుపు) 66, బెండకాయలు 58, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 54, బీరకాయలు 56, ఆనపకాయ 42, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 58, దొండకాయలు 60, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 64, బరబాటి 50, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 42, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 34, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	590
విజయనగరం	594
శ్రీకాకుళం	594

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

పని భారం.. ప్రజలకు దూరం

నగర ప్రజలకు సకాలంలో విస్తృత సేవలు అందించాలనే సదుద్దేశంతో ప్రవేశపెట్టిన వార్డు సచివాలయాలు వాస్తవరూపంలో అందుకు భిన్నంగా తయారయ్యాయి. వివిధ శాఖల సిబ్బందిని వార్డు కార్యాలయంలో కూర్చోబెట్టి పారదర్శకంగా, త్వరితగతిన సేవలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.. కానీ, అధిక పని భారం, సిబ్బంది కొరతతో పాటు అధికారుల నిర్లిప్తత లేకపోవడం, పర్యవేక్షణ కొరవడడం తదితర కారణాలతో కనీస పౌరసేవలు కూడా అందించలేని స్థితికి వార్డు సచివాలయాలు చేరాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం 11:30 గంటలు అవుతున్నా సిబ్బందిలో ఒక్కరంటే ఒక్కరు కూడా సచివాలయంలో కనిపించడం లేదు. అలాంటప్పుడు ప్రజలకు వార్డు సచివాలయాలు ఏపాటి సేవలు అందించగలుగుతాయన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఇంచుమించి ప్రతి సచివాలయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సరైన ప్రణాళిక, నిర్దిష్ట విధి విధానాలు లేకుండా గత ప్రభుత్వ హయాంలో ఆదరాబాదరగా ఏర్పాటైన వార్డు సచివాలయాలు.. కూటమి ప్రభుత్వ హయంలోనూ తీరు మారడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వార్డు సచివాలయాల పనితీరుపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

- ఉదయం సర్వేలు.. సాయంత్రం సమావేశాలు
- సచివాలయాల సిబ్బంది ఉదయం ఫీల్డ్ వర్క్
- సాయంత్రమైతే ఫీడ్‌బ్యాక్ సమావేశాలు
- జోన్-3లో 73 సచిలయాలు
- 657 మంది సిబ్బంది అవసరం కాగా, ఉన్నది 380 మందే..



మద్దిలపాలెం సచివాలయంలో అరకొర సిబ్బందితోనే విధుల నిర్వహణ..

మద్దిలపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల సిబ్బందికి పని ఒత్తిడి పెరుగుతోంది. సిబ్బంది కొరతతో ఇద్దరు ముగ్గురు విధులు ఒక్కరే నిర్వహిస్తున్నారు. జోన్-3లో 73 సచివాలయాలు ఉన్నాయి. ఆయా సచివాలయాల్లో దాదాపు 657 మంది విధులు నిర్వహించాల్సి వుండగా, 380 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఒక్కో సచివాలయానికి అడ్మిన్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, ఎమినిటీస్, శానిటేషన్, హెల్త్, ఎనర్జీ, టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు, వుమెన్ పోలీస్.. ఇలా తొమ్మిది మంది సిబ్బందిని కేటాయించారు. కాగా కొన్ని సచివాలయాల్లో పూర్తి స్థాయిలో కార్యదర్శులు లేరు. స్థానిక 22, 23వ వార్డుల్లో 12 సచివాలయాల్లో 108 మంది సిబ్బంది ఉండాల్సి వుండగా, 82 మంది మాత్రమే ఉన్నారు. 22వ వార్డులో 147, 150, 152 సచివాలయాలకు అడ్మిన్‌లు లేకపోవడంతో ఎడ్యుకేషన్ సెక్రటరీలు ఇన్‌చార్జులుగా ఉన్నారు. అంతేకాకుండా కొంతమంది సెక్రటరీలను వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, కమాండ్ కంట్రోల్ రూమ్, సమ్మిట్ విధుల్లో డెప్యూటేషన్ కింద పంపించారు. దీంతో ఉన్న సిబ్బందిపైనే లేనివారి విధుల భారం పడుతోంది.

సర్వేలు, సమావేశాలు..

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పి4, కౌసల్యం, లైన్ లిస్టింగ్ (ఇంటి కొలతలు), మేన్డేటరి బయోమెట్రిక్ అప్‌డేట్, వాట్సాప్ గవర్నెన్స్ సర్వేలు నిర్వహిస్తోంది. ఈ సర్వేలు సచివాలయ కార్యదర్శులు చేస్తున్నారు. ఉదయం విధులకు రాగానే హాజరు వేసుకొని సర్వేల కోసం ఫీల్డ్ వర్క్‌కు వెళ్లిపోతున్నారు.

అంతేకాకుండా పింఛన్ల పంపిణీ, ప్రభుత్వ పథకాలు, తల్లికి వందనం గ్రీవెన్స్ దరఖాస్తులు, ఫీజు రీ-యింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన విధులు నిర్వహిస్తున్నారు. గతంలో వలంటీర్లు ఉండడంతో ఫీల్డ్ వర్క్ వారు చూసుకునేవారు. ఇప్పుడు ఫీల్డ్‌వర్క్, సర్వేలు, కార్యాలయం పనులను కార్యదర్శులే చేయాల్సి వస్తున్నందున తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఉదయం సర్వేలు చేస్తున్నారు. ఈ సర్వే విధులు పూర్తి చేసిన తర్వాత వాటి ఫీడ్‌బ్యాక్ కోసం సాయంత్రం జీవీఎంసీ జోనల్ కమిషనర్లు, శాఖపరమైన అధిపతులు కార్యదర్శులకు సమావేశాలు పెడుతున్నారు. వాస్తవానికి సచివాలయ సిబ్బంది సమయం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. విధుల నుంచి దిగిపోగానే సమావేశాలంటూ సాయంత్రం 6 గంటల తర్వాత సమావేశాలు నిర్వహించి రాత్రి 8.30 గంటల వరకు కొనసాగించడం విశ్రాంతి లేకుండాపోతోంది. దీనివల్ల మరింత ఒత్తిడికి గురవుతున్నారు.

రూ.70 లక్షలతో ఉద్యానవనాల అభివృద్ధి



ఉద్యానవనం అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటరు మంగవేణి తదితరులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 18వ వార్డులోని ఎంవీపీ రెండో సెక్టరు బాలాజీ పార్కు, వెస్టన్ పార్కుల అభివృద్ధికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, కార్పొరేటరు గొలగాని మంగవేణి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ రెండు పార్కుల్లో.. జీవీఎంసీ మంజూరు చేసిన రూ.70 లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు చోడె పట్టాభిరామ్, గొలగాని పోలారావు, జీవీఎంసీ ఏఈ అప్పలనాయుడు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రం మంచి విజయాన్ని సాధిస్తుంది

- చిత్ర హీరో, హీరోయిన్ విక్రాంత్, చాందిని చౌదరి



మాట్లాడుతున్న చిత్ర హీరో, హీరోయిన్ విక్రాంత్, చాందిని చౌదరి

డాబాగార్డెన్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'సంతాన ప్రాప్తిరస్తు' ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుందని చిత్ర హీరో, హీరోయిన్ విక్రాంత్, చాందిని చౌదరి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం డాబాగార్డెన్స్ వీప్రైడ్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో హీరో విక్రాంత్ మాట్లాడుతూ కెరీర్‌పరంగా సాఫ్ట్‌వేర్‌లో ఉన్నప్పటికీ సినిమాలపై ఇష్టంతో హీరోగా రెండో చిత్రంలో నటించానన్నారు. చిత్రంలోని కొత్త అంశాలు ప్రేక్షకులను నవ్విస్తాయని తెలిపారు. దర్శకుడు సంజీవ్‌రెడ్డి కొత్త ఆలోచనకు తగ్గట్టుగా చిత్రం బాగా రావడానికి నిర్మాతలు శ్రీధర్, హరిప్రసాద్ సహకరించారని తెలిపారు. హీరోయిన్ చాందిని చౌదరి మాట్లాడుతూ ఈ స్క్రిప్ట్ వినగానే ఇప్పుడున్న సమాజంలో చెప్పాల్సిన కథ ఇది అనిపించిందన్నారు. మనకు ఫెర్టిలిటీ సెంటర్స్ చాలా పెరిగాయన్నారు. ఇన్ ఫెర్టిలిటీ ఇష్యూ అంటే అమ్మాయిలనే అనేవారన్నారు. అమ్మాయిలోనే లోపం ఉందని, పిల్లలు పుట్టడం లేదంటే మరో పెళ్లి చేద్దామనే అభిప్రాయానికి వచ్చేవారని, కానీ ఫస్ట్‌టైమ్ మేల్ ఫెర్టిలిటీ ఇష్యూను ఈ సినిమాలో చూపించడం కొత్తగా అనిపించిందని తెలిపారు.

మాట తప్పడం, మడమ తిప్పడం జగన్ నైజం

- మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి



మీడియాతో మాట్లాడుతున్న ఉండవల్లి శ్రీదేవి

ఎంవీపీ కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో అణగారిన వర్గాలకు చేసిందేమీ లేదని మాదిగ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి విమర్శించారు. ఎంవీపీ కాలనీలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్ పాలనలో కార్పొరేషన్ డైరెక్టర్లకు జీతాలు కూడా ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వంలో రెండో తేదీన ఠంచనుగా జీతాలు వస్తున్నాయన్నారు. మాట తప్పడం, మడమ తిప్పడం జగన్ నైజమన్నారు. దళితులను చంపిన వారికి మద్దతు ఇచ్చే జగన్ వారికి ఏదో చేస్తారని ఆశించడం అత్యాశ అవుతుందన్నారు. మాస్క్ అడిగితే చంపేస్తారు. మద్యం, ఇసుక కుంభకోణంపై మాట్లాడితే దాడులు చేశారు. అక్రమాలను ప్రశ్నించిన దళితులకు మేనమామగా ఉంటానన్న జగన్, దళితులను చంపిన వారికి మాత్రమే అండగా ఉన్నారన్నారు. ఎస్సీలపైనే అట్రాసిటీ కేసులు పెట్టించిన ఘనత అతనిదన్నారు. అమరావతిని నాశం చేశారని, సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారన్నారు. కూటమి హయంలో డీఎస్సీ ఎంత పారదర్శకంగా జరిగిందో అందరికీ తెలిసిందేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హయంలో సంక్షేమ పథకాలు విజయవంతంగా సాగుతున్నాయన్నారు.

తోటగరువులో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆరిలోవ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల తోటగరువులో నగరంలోని డాబా గార్డెన్స్‌లో గల ఆదిత్య పీజీ కళాశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ ప్రాంతంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహిస్తున్న ఆదిత్య పీజీ కళాశాల విద్యార్థులు ఈ ప్రాంతంలో వైద్య శిబిరం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అలాగే క్లోవ్ డెంటల్ ఆస్పత్రి సౌజన్యంతో దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టీడీఎస్ఎస్ మూర్తి, రీజనల్ మేనేజర్ రామకృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.143 కోట్లతో హాస్టళ్లను నవీకరించాం

- మాధవధార ఎస్సీ హాస్టల్లో మంత్రి ఆకస్మిక తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి. చిత్రంలో ఎమ్మెల్సీ చిరంజీవి, అధికారులు

మాధవధార, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో సమస్యలకు చిరునామాగా మారిన హాస్టళ్లను చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా రూ.143 కోట్లతో నవీకరించి వసతులు మెరుగుపరిచినట్లు జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల్లో చదువుకునే విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. బుధవారం మాధవధారలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి ఇక్కడి విద్యార్థినులతో మాట్లాడి సదుపాయాల గురించి ఆరా తీశారు. విద్యార్థినులను తమ సొంత బిడ్డల్లా చూసుకోవాలని హాస్టల్ మేట్రన్, సాంఘిక సంక్షేమశాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాల్ని స్వయంగా పరిశీలించిన మంత్రి, విద్యార్థినుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ చిరంజీవి, హాస్టల్ మేట్రన్ గిరీశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఉన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడా పోటీలు



విజేతలకు పతకాలు అందిస్తున్న టీసీఆర్‌టీఎం ఈడీ డాక్టర్ రాణిమందా

సాగర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా సంస్థలో జన జాతీయ గౌరవ్ దివస్ (జేజేజీడీ) 2025 ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి గిరిజన క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లోని విజేతలకు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణిమందా బహుమతులు ప్రదానం చేశారు. కబడ్డీలో బాలురు, బాలికల విభాగంలో చింతూరు ఐటీడీఏ, వాలీబాల్ (బాలురు) పోటీల్లో పార్వతీపురం మన్యం జిల్లా, బాలికల విభాగంలో విజయ నగరం జిల్లా సీతంపేట విజేతలుగా నిలిచాయి. అలాగే జావెలిన్‌త్రో బాలురు, బాలికల విభాగంలో పాడేరు, ఆర్చరీ బాలుర విభాగంలో పాడేరు, బాలికల విభాగంలో సీతంపేట విజయం సాధించాయి. వక్తృత్వ పోటీలో సీతంపేట, చిత్రలేఖనంలో కేఆర్‌పురం గెలుపొందాయి.

వీఎంఆర్డీఏ ఛైర్మన్‌ను కలిసిన మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ శ్రీదేవి



ప్రణవ్ గోపాల్‌ను కలిసిన మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, డైరెక్టర్ ఈతలపాక సుజాత, నాగభూషణ్ తదితరులు

సిరిపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్‌ను రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం విశాఖ పర్యటనకు వచ్చిన ఆమె వీఎంఆర్డీఏ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ప్రణవ్ గోపాల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ వివరించారు. ఎస్సీ సామాజిక వర్గం అభివృద్ధికి వీఎంఆర్డీఏ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు ఈతలపాక సుజాత, నాగభూషణ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్లు తొలగింపు



కేబుల్ వైర్లు తొలగిస్తున్న సిబ్బంది

సిరిపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో ప్రధాన రహదారులకు ఇరువైపులా అడ్డదిడ్డంగా ఉన్న కేబుల్ వైర్ల తొలగింపునకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు.

సీఐఐ సదస్సు నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధతీసుకొని నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. అయితే, రోడ్లుకు ఇరువైపులా ఎక్కడ పడితే అక్కడ కేబుల్ వైర్లు వేలాడుతూ ఉండటాన్ని గుర్తించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వీటిని తొలగించాలని సిబ్బందికి సూచించారు. అయితే, ప్రైవేటు కంపెనీలకు చెందిన కేబుల్ వైర్లు కావడంతో, ఆయా కంపెనీలకు నష్టం తలెత్తకుండా సరిచేసుకునే అవకాశం కల్పించారు. ప్రధాన రహదారుల్లో కిందకు వేలాడుతూ ఉన్న కేబుల్ వైర్లను ఆయా సంస్థల వారే తొలగించాలని ఆదేశించారు. ఈ నెల 14, 15 తేదీల్లో నగరంలో సీఐఐ సదస్సు జరుగనున్న నేపథ్యంలో వీటిని యుద్ధ ప్రాతిపదికనతొలగించేలా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. కేబుల్ వైర్లు ఏర్పాటు చేసిన వారు, స్పందించకుంటే, వాటినే జీవీఎంసీ సిబ్బంది తొలగించాలని కమిషనర్ ఆదేశించారు.

ఈ నేపథ్యంలో ఆశీల్‌మెట్ట, సిరిపురం, వీఐపీ రోడ్ వంటి తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కేబుల్ వైర్లను బుధవారం జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. కొన్ని చోట్ల ఆయా సంస్థల వారే కేబుల్ వైర్లను స్వచ్ఛందంగా తొలగించారు. విద్యుత్ స్తంభాలకు వేలాడుతూ, తీవ్ర అసౌకర్యంగా ఉన్న కేబుల్ వైర్లు తొలగిస్తుండటంపై ఆయా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లోని రోడ్లపై కిందకు వేలాడుతూ ఇబ్బందికరంగా ఉన్న కేబుల్ వైర్లను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకుంటే మరింత సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలి

- ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ రామరాజు



మాట్లాడుతున్న ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ రామరాజు

మద్దిలపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ రామరాజు సూచించారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన విద్యార్థులకు మానసిక సమస్యలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల విద్య నుంచి విద్యార్థులకు ఒత్తిడి పెరుగుతుందని, ఆ ఒత్తిడిని అధిగమిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఒత్తిడి నియంత్రణకు ధ్యానం, యోగా చేయాలని సూచించారు. ముఖ్యంగా భయం, కష్టంగా చదవకుండా సబ్జెక్టుపై ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఏ రోజుకు ఆ రోజు సిలబస్ నేర్చుకుంటే పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడి ఉండదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, కో-ఆర్డినేటర్ లక్ష్మణరావు, రవిబాబు, రాజేశ్వరరావు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

చిల్లర వర్తకుల వ్యాపారాలు చేసుకోనీయండి

- సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు

మద్దిలపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వ్యాపార భాగస్వామ్య సదస్సు పేరుతో చిల్లర వర్తకుల వ్యాపారాలు మూయించకుండా యథావిధిగా కొనసాగించాలని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు బుధవారం ఒకక ప్రకటనలో కోరారు. ఏ రోజుకు ఆ రోజు వ్యాపారం చేసుకుని పొట్ట పోషించుకునే చిరు వర్తకుల వ్యాపారాలు మూయిస్తే, వారెలా బతుకుతారని ప్రశ్నించారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో తోపుడు బండ్లు వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్న వ్యాపారాలను తొలగించి వారిని రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయం ఉపాధి ఏర్పాడు చేసుకొని బతుకున్న తోపుడు బండ్లు వర్తకులను వ్యాపారాలు చేసుకోనీయకుండా చేయడం సరికాదన్నారు. వ్యాపారాలు తొలగించిన కాలానికి నష్ట పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు.

ఆలయానికి ప్రత్యామ్నాయ మార్గం కోసం పరిశీలన



సమాలోచనలు జరుపుతున్న కార్పొరేటర్ సునీత, అధికారులు

ఆరిలోవ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల రామకృష్ణాపురంలోని సూర్యనారాయణ స్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని కొత్త మార్గాల ప్రతిపాదన నిమిత్తం 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, సింహాచలం దేవస్థానం డీఈ రామరాజు, ఏఈ లోకేష్, కొందరు స్థానికులు కలిసి బుధవారం చర్చించారు. సూర్యనారాయణస్వామి ఆలయానికి వెళ్లే మార్గం, భక్తులు వచ్చే మార్గం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి తీసుకెళ్లి, త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చూడాలని, ఇందుకు కోసం తమ వంతుగా కృషి చేస్తున్నామని కార్పొరేటర్ సునీత తెలిపారు.


రెడ్డికంచరపాలెం సచివాలయంలో సిబ్బంది


జగ్గారావు బ్రిడ్జి వద్ద సచివాలయంలో....


24వ వార్డులోని 1086124 సచివాలయంలో..


దండుబజార్‌లో పలుచగా సిబ్బంది

సచివాలయ అవస్థ!

కంచరపాలెం/అక్కయ్యపాలెం/సీతమ్మధార/మహారాణిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కిందిస్థాయికి ప్రభుత్వ పాలన తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో ఐదేళ్ల కిందట రూపకల్పన చేసిన సచివాలయ వ్యవస్థ గ్రేటర్ విశాఖలోని పలు వార్డులలో ఇంకా అవస్థలతోనే కొట్టుమిట్టాడుతోంది. ప్రజలకు చేరువలో ఓ ప్రభుత్వ వ్యవస్థ ఉందన్న మాట మినహా ఉద్యోగుల పరంగానూ, ప్రజల సదుపాయాల పరంగా చూస్తే పెదవి విరిచే పరిస్థితి నెలకొంది. ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో ఈ వ్యవస్థ ఎలా కొనసాగుతోందో 'ఆంధ్రజ్యోతి' పరిశీలించినప్పుడు పర్యవేక్షణ, సమన్వయలోపం కొట్టొచ్చినట్టు కనిపించింది. సిబ్బంది సర్దుబాటుకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో నేటికీ కార్యరూపం దాల్చలేదు. 54వ వార్డు పరిధి రైతుబజారు పక్కన గల 267 దుర్గానగర్‌లో 9మంది సిబ్బందికి ప్రస్తుతం ఆరుగురు విధుల్లో ఉన్నారు. వీఆర్వో, శానిటరీ సెక్రటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 56వ వార్డు పరిధి 266 రెడ్డి కంచరపాలెం సచివాలయంలో ఏడుగురు సిబ్బంది విధులు చేపడుతున్నారు. మిగిలిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్టేషనరీ, కంప్యూటర్లు సరిపడా లేవు. కంప్యూటర్లు సరిగ్గా పనిచేయక అవస్థలు తప్పడం లేదు. చాలా కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గ్రేటర్ 26, 43 వార్డుల పరిధి 241, 243 సచివాలయాల్లో ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు. సిబ్బంది కొరతతో ప్రజలకు సేవలందించడంలో జాప్యం జరుగుతోంది. శ్రీనివాసనగర్‌లోని 241వ నెంబరు సచివాలయంలో శానిటేషన్ సెక్రటరీ ఇటీవల బదిలీ అయ్యారు. అడ్మిన్ కలెక్టర్ కార్యాలయానికి, మరొకరు విజన్ 2047 వర్క్‌కు డెప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. వేరే సచివాలయం సెక్రటరీకి ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. 243వ నెంబరు సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీ డెప్యుటేషన్‌పై వెళ్లారు. 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని 129వ సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీ డెప్యుటేషన్‌పై వెళ్లడంతో 128 నెంబరు సెక్రటరీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సీతమ్మధార నక్కవానిపాలెంలో అధిక పనిభారంతో సిబ్బంది సతమతమవుతున్నారు. తమకు కేటాయించిన పనులతో పాటు ఇతర విభాగాల బాధ్యతలు మోయాల్సి వస్తోందని వాపోతున్నారు. పన్నుల వసూలు, సర్వేలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన, ప్రభుత్వ సూచనల మేరకు అవగాహన ర్యాలీలు, ఇతర ఆకస్మిక బాధ్యతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. 1086123 సచివాలయంలో ఇంచార్జ్ వీఆర్వో ఉండగా, మహిళా పోలీస్ డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఏఎన్ఎంలు సోమ, శుక్రవారాలు వస్తుంటారు. 1086124 సచివాలయంలో అడ్మిన్‌తో పాటు ప్లానింగ్ సెక్రటరీ, వెల్ఫేర్, మహిళా పోలీస్ సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఇంచార్జ్ వీఆర్ఓ వస్తుంటారు. సర్వేల పేరుతో ఒత్తిడి పెరిగిందని దండుబజారు ప్రాంత సచివాలయాల సిబ్బంది వాపోతున్నారు. ఈ ఒక్క ఏడాదిలోనే మునుపటికన్నా రెట్టింపు సర్వేలు నిర్వహించామని పేర్కొన్నారు. ఫీల్డ్ వర్కు ఓటీపీతో అనుసంధానమై ఉండడం, ప్రజలు ఓటీపీ చెప్పేందుకు నిరాకరించడం, తాము కొత్తగా రావడంతో అనుమానిస్తున్నారని వాపోయారు. అధికారులు ప్రతిగంటకు వివరాలు కోరుతుండడంతో ఒత్తిడి అధికంగా ఉంటోందని అన్నారు. ఇటీవల బదిలీలు చేపట్టిన తరువాత సిబ్బంది చాలా చోట్లకు రాలేదు. గతంలో వాలంటీర్లతో ఫీల్డ్ వర్కు జరిగేది. ఇప్పుడు తామే క్షేత్రస్థాయికి వెళ్తుండడం, కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో వివిధ పనులపై వచ్చేవారు తాము విధులు సరిగా నిర్వర్తించడం లేదనే అపోహలో ఉన్నారని పేర్కొంటున్నారు. వివరాల నమోదు, సర్టిఫికెట్ల జారీకి కంప్యూటర్లు, ప్రింటర్లు లేక బయట జెరాక్స్ సెంటర్లలో ప్రింట్ తీసుకోమని సూచిస్తున్నారు.

సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్


అవగాహన కల్పిస్తున్న సాయికృష్ణ

జ్ఞానాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'యువత సైబర్ సెక్యూరిటీ' అనే ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌ను సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలతో కలిసి హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ బుధవారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సీనియర్ కన్సల్టెంట్ సింగపురం సాయికృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సైబర్ ముప్పును గుర్తించడం, వ్యక్తిగత డేటాను భద్రపరచడం, సురక్షిత ఆన్‌లైన్ లావాదేవీలను అలవరచుకోవడం అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నిబంధనలు అతిక్రమించొద్దు

మురళీనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్లకూడదని రవాణా శాఖ కార్యాలయ ఇంచార్జి ఆర్.సి.హెచ్.శ్రీనివాసరావు సూచించారు. వాహనదారుల వద్ద డ్రైవింగ్ లైసెన్సు, ట్యాక్స్ పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ విధిగా ఉండాలన్నారు. పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో ఈ నెల 13 నుంచి 15 వరకు రోడ్లపై డ్రైవర్లు అప్రమత్తత పాటించాలని అన్నారు. టూరిస్ట్ బస్సులు కూడా అత్యవసర ద్వారాలకు అడ్డంగా టైర్లు ఉంచడం, పరిమితికి మించి లగేజీలు తీసుకెళ్లడం వంటివి చేయకూడదన్నారు. పోలీస్, రవాణా శాఖల మార్గదర్శకాలు పాటించాలని కోరారు.

మాకిరెడ్డి రామునాయుడు మృతికి సంతాపం

అల్లిపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు అకాల మరణానికి ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు జె.వి. సత్యనారాయణమూర్తి ప్రగాఢ సంతాపం తెలిపారు. కళలపై ఆసక్తితో ప్రజానాట్యమండలిలో చేరి, ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యునిగా పార్టీ కార్యకలాపాల్లో, ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. ఆయన మరణం బాధాకరమన్నారు. మాజీ శాసనసభ్యుడు మానం ఆంజనేయులు, చలసాని రాఘవేంద్రరావు, మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె. రహమాన్ తదితరులు సంతాపం తెలిపారు.

పర్యావరణానికి తూట్లు


కొమ్మలు నరకడంతో బోసిపోయిన చెట్లు

అక్కయ్యపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని చెట్ల కొమ్మలను ఇష్టానుసారంగా నరికి పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. కొమ్మలు, చెట్లను నరకాలంటే ఉద్యానవన శాఖ అనుమతి తీసుకోవాలి. ఈ ప్రాంతంలో అపార్ట్‌మెంట్‌కు ఎదురుగా ఉన్న చెట్లకొమ్మలను నరికివేయడంతో స్థానికులు మండిపడుతున్నారు. తమ స్వార్థం కోసం పర్యావరణానికి తూట్లు పొడవడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

... 5వ పేజీ తరువాయి

పరిధిలోని 241, 243 సచివాలయాలను ఇన్‌చార్జులతో నెట్టుకొస్తున్నారు. సిబ్బంది లేక ప్రజలకు అందించాల్సిన సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. మూడు నెలలుగా కంప్యూటర్లు పనిచేయడం లేదు. ● జీవీఎంసీ 54వ వార్డు దుర్గానగర్ సచివాలయంలో వీఆర్వో, శానిటరీ సెక్రటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్టేషనరీ కొరత ఎక్కువగా ఉంది. కంప్యూటర్స్ పనిచేయడం లేదు. ● పెందుర్తి పరిధిలో రీగ్రూపింగ్ చేసిన తరువాత కొంతమందిపై పని భారం పెరిగింది. మరికొంతమందికి అసలు పని లేకుండా పోయింది. ● మహారాణిపేట పరిధిలోని సచివాలయాల్లో ప్రింటర్లు, కంప్యూటర్లు మూలకు చేరాయి. ధ్రువపత్రాలు, ఇతర సర్టిఫికెట్లు బయట ప్రింట్ తీసుకోవాలని సిబ్బంది సూచిస్తున్నారు.

రూ.143 కోట్లతో హాస్టళ్లను నవీకరించాం


విద్యార్థినులతో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

» ఇన్‌చార్జి మంత్రి మంత్రి డోలా

మాధవధార, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో సమస్యలకు చిరునామాగా మారిన హాస్టళ్లను చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా రూ.143 కోట్లతో నవీకరించి వసతులు మెరుగుపరిచినట్లు జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల్లో చదువుకునే విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. బుధవారం మాధవధారలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి ఇక్కడి విద్యార్థినులతో మాట్లాడి సదుపాయాల గురించి ఆరా తీశారు. విద్యార్థినులను తమ సొంత బిడ్డల్లా చూసుకోవాలని హాస్టల్ మేట్రన్, సాంఘిక సంక్షేమశాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాల్ని స్వయంగా పరిశీలించిన మంత్రి, విద్యార్థినుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ చిరంజీవి, హాస్టల్ మేట్రన్ గిరీశ్వరి, అధికారులు ఉన్నారు.

అట్టహాసంగా టీడీపీ బాధ్యుల ప్రమాణ స్వీకారం


పార్టీ బాధ్యతలు చేపట్టిన క్లస్టర్ ఇన్‌చార్జిలు, వార్డు అధ్యక్షులతో ప్రమాణం చేయిస్తున్న టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్

మహారాణిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గం వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం అట్టహాసంగా జరిగింది. పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ వైద్య సేవా సంస్థ చైర్మన్, దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఒకటి నుంచి 12 వరకు క్లస్టర్లకు ఇన్‌చార్జులు వరుసగా షేక్ జుబేర్, దాసన్న సత్యనారాయణ, పుక్కల రాజేశ్వరి, విల్లూరి తిరుమల, విల్లూరి భాస్కరరావు, వాసుపల్లి దానయ్య, కేదారి లక్ష్మి, బంగారు రవి శంకర్, పోలిపల్లి జ్యోతి, ఉరుకూటి నారాయణరావు, వానపల్లి గాయత్రీ ఫణి కుమారి, గొలగాని వీరారావులు ప్రమాణం చేశారు.

వార్డు అధ్యక్షులుగా..

టీడీపీ వార్డు అధ్యక్షులుగా (బ్రాకెట్లలో వార్డు నెంబరు) అల్లూరి సత్యనారాయణ రెడ్డి (27), కండిపల్లి సతీష్ కుమార్ (29), డొకర రమణ (30), బత్తిన వెంకట సత్యనవీన్ కుమార్ (31), దాసరి దుర్గారెడ్డి (32), కర్రి నీలకంఠంరావు(33), వానపల్లి రామ్‌కుమార్ (34), బుచ్చా రామిరెడ్డి (35), కోడూరి శివయ్య (36), పిల్ల తాతయ్యలు (37), మజ్జి త్రినాధరావు (38), షైలిపల్లి శ్రీనివాసరావు(39), ఐతి మధుబాబు (41) ప్రమాణం చేశారు. వీరితో పాటు కో-క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జులు ప్రమాణ స్వీకారం చేశారు.

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి

» దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


పట్టాలు అందుకున్నవారితో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద అర్హులను ఎంపిక చేసి మంజూరు పత్రాలు అందజేస్తున్నట్లు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన కార్యాలయంలో 21 మందిని ఎంపిక చేసి బుధవారం పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పక్షపాతి అని, సంక్షేమ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. లబ్ధిదారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఎంఎం నాయుడు, జనసేన నాయకులు, వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు గృహయోగం

... 5వ పేజీ తరువాయి

లబ్ధిదారులు స్వయంగా నిర్మించుకున్నవి 38,389 ఇళ్లు. ఈ సందర్భంగా పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పాల్గొని లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గృహ ప్రవేశాలు చేసిన ఇళ్లలోకి మంత్రి, ఇతర నాయకులు వెళ్లి లబ్ధిదారులతో ముచ్చటించారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, హౌసింగ్ పీడీ సీహెచ్ సత్తిబాబు, ఇతర అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. కాగా పీఎంఏవై 2.0లో కొత్తగా మంజూరుచేసిన ఇళ్లకు సంబంధించి పెందుర్తి పరిధిలో 69వ వార్డులో శంకుస్థాపనలు చేశారు. ఇంకా గాజువాక, విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు పత్రాలు అందజేశారు.

గురుకులానికి ఫ్యాన్ల వితరణ

అల్లిపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నుంచి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి పి.వి.ఎస్ రాజు తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వ్యక్తిత్వ వికాస పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 20న ముగింపు ఉత్సవాలు జరుపుతామన్నారు.

వాలీబాల్, బాస్కెట్‌బాల్ విజేత ఏయూ ఇంజనీరింగ్ కళాశాల


బాస్కెట్‌బాల్, వాలీబాల్ విన్నర్ ఏయూ కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ జట్టుకు ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రముఖులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్, బాస్కెట్‌బాల్ టోర్నీలో ఏయూ కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ చాంపియన్‌గా నిలిచింది. సిల్వర్ జూబ్లీ గ్రౌండ్‌లో జరిగిన వాలీబాల్ టోర్నీలో ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ స్థానం, చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానం, ప్రగతి కళాశాల తృతీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. బాస్కెట్‌బాల్ టోర్నీలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, ద్వితీయ స్థానంలో ప్రగతి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, తృతీయ స్థానంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల నిలిచాయి. టోర్నీల ముగింపు కార్యక్రమానికి బాస్కెట్‌బాల్ సీనియర్ కోచ్ బొజ్జా రామయ్య ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, ఆచార్య ఎ.పల్లవి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, డాక్టర్ ఎస్.గోపీకృష్ణ, డాక్టర్ దిలీప్, రామచంద్రరావు పాల్గొన్నారు.

బాక్సింగ్ టోర్నీ చాంప్ బుల్లయ్య


పతకాలు సాధించిన విద్యార్థినులతో కళాశాల ప్రతినిధులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో బుల్లయ్య కళాశాల ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. డిగ్రీ కళాశాల నుంచి ప్రాతినిధ్యం వహించిన విద్యార్థినులు పతకాలు సాధించారు. 48 కిలోల విభాగంలో హీనా స్వర్ణం, 57 కిలోల విభాగంలో అర్షిత రజతం, 54 కిలోల విభాగంలో సౌజన్య కాంస్య పతకాలు సాధించారు. ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థిని ఎస్‌జీఎస్.మల్లిక ఉత్తమ బాక్సర్ అవార్డు అందుకుంది. పతకాలు సాధించిన విద్యార్థినులను కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ తన కార్యాలయంలో బుధవారం అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చక్రవర్తి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.దీపక్ చౌదరి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎం తనిఖీలు


ఎన్ఎండీసీ అధికారులతో చర్చిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని కేకే లైనులో కిరండూల్, బచేలి సెక్షన్‌లతోపాటు ఎన్ఎండీసీలో రైల్వే కార్యకలాపాలను డీఆర్ఎం లలిత్ బొహ్రా సమీక్షించారు. బుధవారం ఎన్ఎండీసీలో పర్యటించిన ఆయన ఉత్పాదకత పెంపు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. సరుకు లోడింగ్ కార్యకలాపాల మెరుగుకు అవసరమైన చర్యలపై ఎన్ఎండీసీ అధికారులతో చర్చించారు. రిసెప్షన్ యార్డు, లోడింగ్ ప్లాంట్ వంటి ప్రాంతాలలో సైడింగ్‌లను తనిఖీ చేసి, వ్యాగన్ డిశ్చార్జ్ సిలో వ్యవస్థను పరిశీలించి రైల్వే, ఎన్ఎండీసీ సంస్థలు అదనపు ఆదాయాన్ని ఆర్జించే మార్గాలను సమీక్షించారు. అనంతరం కేకే లైనులో జరుగుతున్న డబ్లింగ్ పనులు, స్టేషన్ల అభివృద్ధి కార్యకలాపాలను పరిశీలించారు. డీఆర్ఎం పర్యటనలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలపై నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

వైసీపీ డిమాండ్

మహారాణిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పీపీపీ పేరుతో వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని వైసీపీ డిమాండ్ చేసింది. మాజీ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్‌కుమార్ నాయకత్వంలో బుధవారం ఏవీఎన్ కళాశాల నుంచి టర్నర్ చౌల్ట్రీలోని తహసీల్దార్ కార్యాలయం వరకు వైసీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వ నిర్ణయం కారణంగా బోధనాసుపత్రులలో పేదలకు ఉచిత వైద్య సదుపాయం దూరమవుతుందని గణేష్‌కుమార్ ఆరోపించారు. రాష్ట్రం పెద్ద సంఖ్యలో మెడికల్ సీట్లు కోల్పోతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పీపీపీ పేరుతో డ్రామాలా డుతోందని విమర్శించారు. దక్షిణ నియోజకవర్గంలోని పార్టీ కార్పొరేటర్లు, వార్డుల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం

సీతమ్మధార: వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలని కోరుతూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పేర్కొన్నారు. గురుద్వార కూడలి నుంచి సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం వైసీపీ శ్రేణులుచ ర్యాలీ నిర్వహించిన అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైసీపీ నాయకులు

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.95 కోట్లు

సింహాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులు గత 28 రోజులుగా హుండీలలో సమర్పించిన కట్నకానుకల ద్వారా సుమారు రూ.1.95 కోట్ల ఆదాయం సమకూరింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్.సుజాత పర్యవేక్షణలో బుధవారం పరకామణి కేంద్రంలో హుండీలను తెరిచి ఆదాయాన్ని లెక్కించారు. ఇందులో రూ.1,95,27,442 నగదు, 83.1 గ్రాముల స్వర్ణం, 11.2 కిలోల రజితం ఆభరణాల రూపంలో స్వామిఖజానాకు లభించాయి. అదేవిధంగా 192 యూఎస్ఏ డాలర్లు, 100 ఒమన్ కరెన్సీ, 140 యూరోలు, 65 కెనడా డాలర్లు, 13,030 యూఏఈ ధీరమ్స్, ఏడు సింగపూర్ డాలర్లు, 11 ఖతార్ రియల్స్, మలేషియా, నేపాల్, టర్కీ, భూటాన్, శ్రీలంక, ఆస్ట్రేలియా, తదితర దేశాల కరెన్సీ లభించింది. హుండీల లెక్కింపునకు ప్రత్యేక పరిశీలకుడిగా దేవదాయశాఖ అధికారి శ్రీధర్ హాజరయ్యారు. సింహాచలం ఏఈవోలు, పర్యవేక్షణాధికారులు, ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్, శ్రీహరి సేవా సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరిగిన విమాన ప్రయాణికులు

... 5వ పేజీ తరువాయి

విశాఖ నుంచి వెళ్లినవారు 4,459 మంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు చూసుకుంటే మొత్తం 471 విమానాలు రాకపోకలు సాగించగా, వాటి ద్వారా 59,115 మంది ప్రయాణించారు. మొత్తం చూసుకుంటే ఏప్రిల్ నుంచి అక్టోబరు నెలాఖరు వరకు డొమెస్టిక్, అంతర్జాతీయ ప్రయాణం చేసినవారు 17,09,912 మందిగా నమోదైనట్టు విమానాశ్రయం వర్గాలు తెలిపాయి.

2,200 మందితో బందోబస్తు

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ నగరంతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి అధికారులు, సిబ్బంది సేవలను వినియోగించుకుంటున్నామన్నారు. ఢిల్లీ ఘటన నేపథ్యంలో సదస్సు జరిగే ప్రాంగణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ఒక త్రెడ్ డ్రోన్, 15 డ్రోన్లతో నిరంతర నిఘా ఏర్పాటుచేశామన్నారు. ఇవికాకుండా 155 సీసీ కెమెరాలను ప్రాంగణంలోని కీలక ప్రాంతాల్లో అమర్చామన్నారు. వీటన్నింటినీ పర్యవేక్షించేందుకు సదస్సు జరిగే ప్రాంగణంలోనే ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేశామన్నారు. ప్రధాన వేదికతోపాటు, హెలీపాడ్, వీఐపీలు సమావేశమయ్యే హాళ్లు, గదులు, మంత్రుల సమావేశాలు జరిగే ప్రాంతాలు, భోజనశాలలను ఇప్పటికే బాంబుస్క్వాడ్‌లు, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టామన్నారు. వీటితోపాటు ప్రముఖులు, సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు బస చేసే హోటళ్లలో కూడా భద్రతాపరమైన తనిఖీలు నిర్వహించామన్నారు. సిబ్బందికి 200 బాడీవార్న్ కెమెరాలు అందజేశామన్నారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాల్లో ట్రాఫిక్ పర్యవేక్షణకు 'అస్త్రం' యాప్‌ను వినియోగించుకుంటామన్నారు.ఆయా రూట్లలో ట్రాఫిక్‌జామ్ కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

కాలక్షేపం చేసేవారే అధికం

... 5వ పేజీ తరువాయి

సచివాలయాలకు ఒకరు చొప్పున వీఆర్‌ఓలను నియమించారు. మూడు నెలల కిందట వార్డు సచివాలయాల్లో సిబ్బందిని రేషనలైజేషన్ చేశారు. ప్లానింగ్, ఎమినిటీస్ సెక్రటరీలకు రెండేసి వార్డు సచివాలయాల బాధ్యతలను అప్పగించారు. వార్డు సచివాలయంలో మహిళా పోలీసులు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ఆకతాయిలు, పేకాటరాయుళ్లు, వ్యభిచారం, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలు విక్రయం, వినియోగం, రవాణా వంటివాటికి సంబంధించిన సమాచారం సేకరించాల్సి ఉంటుంది. అలాగే చోరీల నియంత్రణకు తీసుకోవాల్సి జాగ్రత్తలు, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి బాధ్యతలను చూడాల్సి ఉంటుంది. అయితే కొద్దిమంది మినహా మహిళా పోలీసులు ఎవరూ ఆ బాధ్యతలను నిర్వర్తించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే వార్డు శానిటేషన్ సెక్రటరీలు తమకు కేటాయించిన ప్రాంతంలో ఉదయం ఆరు నుంచే తిరుగుతూ గెడ్డల నిర్వహణ, చెత్త సేకరణ, క్లాప్ వాహనాల పనితీరు, పారిశుధ్య సిబ్బంది హాజరు పరిశీలించాల్సి ఉంటుంది. కానీ కొద్దిమంది మాత్రమే ప్రభుత్వం నిర్దేశించిన జాబ్‌చార్ట్ ప్రకారం పనిచేస్తున్నారని, మిగిలినవారు మాత్రం పట్టించుకోనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వార్డు ఎమినిటీ, ప్లానింగ్ సెక్రటరీలతోపాటు హెల్త్ సెక్రటరీలకు మాత్రం పనిభారం ఎక్కువగా ఉంటోందని చెబుతున్నారు.

సచివాలయాల్లో స్టేషనరీ కొరత

... 5వ పేజీ తరువాయి

సచివాలయం సిబ్బంది వచ్చి వెరిఫై చేస్తారు. అవి మంజూరైన తరువాత ఇంతకు ముందు సచివాలయాల్లోనే ప్రింట్ తీసి ఇచ్చేవారు. ఇప్పుడు వాటిని మీ-సేవా కేంద్రాలకు వెళ్లి తీసుకోవలసి వస్తోంది. వీటిపై ఎంతమంది ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండడం లేదు.

నగరం సర్వాంగ సుందరం

... 5వ పేజీ తరువాయి

సెంటర్ మీడియన్లు, కూడళ్లలో ఆకట్టుకునేలా అందమైన పూలమొక్కలను నాటి పచ్చదనం అభివృద్ధి చేశారు. నగరంలోని ముఖ్యమైన రోడ్లపై ఉన్న కూడళ్లలో సర్కిల్స్‌ను నిర్మించి వాటిలో వాటర్ ఫౌంటెయిన్లు, ఆకట్టుకునేలా కళాకృతులను ఏర్పాటుచేశారు. వీటన్నింటి నేపథ్యంలో నగరానికి కొత్తశోభ వచ్చి రాత్రిపూట మరింత అందంగా కనిపిస్తోంది.

జీరో వేస్ట్ ఈవెంట్‌గా గుర్తింపు కోసం జీవీఎంసీ కార్యాచరణ

సీఐఐ సదస్సులో చెత్త అనేది లేకుండా చేయడం ద్వారా దేశంలోనే మొదటి జీరో వేస్ట్ ఈవెంట్‌గా గుర్తింపుపొందాలని జీవీఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది. సదస్సు జరిగే రెండురోజులు ప్రాంగణంలో సింగిల్ యూజ్‌ప్లాస్టిక్ అనేది లేకుండా ఎకో ఫ్రెండ్లీ వస్తువులనే వాడాలని నిర్ణయించారు. అతిథులు టీ, కాఫీ తాగేందుకు కప్పులను ప్రత్యేకంగా రాగిపిండితో తయారుచేశారు. టీ తాగేసిన తర్వాత కప్పులను తినేయాలని సూచిస్తారు. అలాగే ప్రతినిధులకు ప్లాస్టిక్ బాటిళ్లతో కాకుండా మట్టితో తయారుచేసిన వాటితో తాగునీరు అందించబోతున్నారు. భోజనం ప్లేట్లు, టిష్యూ పేపర్లు వంటివి ఉన్నాసరే వాటిని అక్కడికక్కడే రీసైక్లింగ్ చేసేలా ఏర్పాటుచేస్తున్నారు. పొడిచెత్తను వేరుచేసి అక్కడికే వ్యాపారులు వచ్చి కొనుక్కొని వెళ్లేలా వెసులుబాటు కల్పించనున్నారు. తడిచెత్తను కూడా ప్రాంగణంలోనే రీసైక్లింగ్ చేసేలా ప్రత్యేకంగా కంపోస్ట్ యూనిట్‌ను ఏర్పాటుచేశారు. సదస్సు జరిగే రెండు రోజులు ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణకు జీవీఎంసీ అధికారులు మూడు షిఫ్టుల్లో కార్మికులను సిద్ధం చేశారు.

కిడ్నీ రాకెట్

... 5వ పేజీ తరువాయి

మృతదేహాన్ని విశాఖకు తరలించేందుకు ఏర్పాట్లుచేసింది. ఈ విషయం యమునతో సహజీవనం చేస్తున్న వ్యక్తికి తెలియడం, అదే సమయంలో దళారుల మధ్య వివాదం తలెత్తడంతో పోలీసుల దృష్టికి వెళ్లింది. పోలీసులు ప్రాథమిక విచారణ జరిపి దళారులుగా వ్యవహరించిన పద్మ, సూరిబాబు, సత్యతోపాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దళారుల్లో ఇద్దరు విశాఖకు చెందినవారిగా చెబుతున్నారు. వారే ఆమెను దగ్గరుండి మదనపల్లె తీసుకువెళ్లారు. ఈ కిడ్నీ మార్పిడి ఒప్పందంలో గాజువాక ప్రాంతానికి చెందిన దళారి పద్మ కీలకంగా వ్యవహరించినట్టు చెబుతున్నారు.

యథేచ్ఛగా సాగుతున్న దందా..

గడిచిన మూడేళ్లలో ఈ తరహా దందాలు ఎన్నో వెలుగులోకి వచ్చాయి. రెండేళ్ల కిందట కిడ్నీ ఇస్తే సుమారు రూ.పది లక్షలు ఇస్తామని చెప్పి మధురవాడ వాంబే కాలనీకి చెందిన ఒక డ్రైవర్‌ను దళారులు నమ్మించారు. పెందుర్తిలోని ఒక క్లినిక్‌లో కిడ్నీ తీసుకుని, రూ.2.5 లక్షలు చేతిలో పెట్టారు. డబ్బులు పూర్తిగా ఇవ్వకపోగా కిడ్నీ మార్పిడి అనంతరం అనారోగ్యం పాలైనప్పటికీ పట్టించుకోకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. శస్త్రచికిత్స నిర్వహించిన ఆస్పత్రికి కనీసం అనుమతి కూడా లేదని అధికారులు విచారణలో తేలింది. అలాగే రెండున్నరేళ్ల కిందట వాంబే కాలనీకి చెందిన మరో మహిళకు డబ్బు ఆశ చూపించి కిడ్నీ అమ్మేశారు. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. ఆర్థిక లావాదేవీల్లో తేడాలు రావడంతో మాత్రమే ఇవన్నీ బయటకు వస్తున్నాయి. కానీ, బయటకు రాకుండా గుట్టుగా సాగిపోతున్నవెన్నో ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ తరహా ముఠాలపై ఆరోగ్యశాఖ అధికారులు, పోలీసులు గట్టిగా దృష్టి సారించాల్సి ఉంది.

అయ్యప్పకు పూజలు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న శివాలయంలో అయ్యప్పమాలధారణ భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌కు, ఉద్యోగులకు మంచి జరగాలని పూజలు చేశారు. ఈ పూజల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాలుగు కిలోల వెండి నాగాభరణం బహూకరణ



నాగాభరణం బహూకరించిన భక్తులు

ఆటోనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలో బ్రహ్మసూత్ర శివాలయానికి సుమారు రూ.6లక్షల విలువైన 4 కేజీల వెండి నాగాభరణాన్ని నెక్కింటి శ్రీనివాస్, జ్యోతి బహూకరించారని కార్పొరేటర్ బొండా జగన్ తెలిపారు.

జగన్నాథుడికి అర కిలో వెండి కానుక

పెందుర్తి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం గోపాలకృష్ణ ఆలయంలో ఉన్న జగన్నాథ స్వామి వారికి అరకిలో వెండిని కానుకగా ఇచ్చారు. ఈ సందర్భంగా దాతలు కనకమేడల నరసింహమూర్తి, విజలక్ష్మి దంపతులు ఆయా వెండి వస్తువులను ఆలయ నిర్వాహకులకు బుధవారం అందజేశారు. అంతకముందు ఆలయంలో పూజలు చేసి దాతలను సత్కరించారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి విద్యార్థుల కృషి తప్పనిసరి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే అనర్థాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. ఆదిత్యా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ సభ్యులు బుధవారం ప్లాస్టిక్ అనర్థాలపై తుంగ్లాంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎన్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ బైక్ ర్యాలీ

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు బుధవారం 68వ వార్డులో వైసీపీ బైక్ ర్యాలీని జిల్లా కార్యదర్శి గుడివాడ లతీశ్ ప్రారంభించారు. మిందిలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నాగబంధన్ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

కూర్మన్నపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు లక్ష్మీపురం త్రిశక్తి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బుధవారం ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో నాగబంధన్ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక ంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా గణపతి పూజ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలు భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు

సినిమా గైడ్

- **ది గర్ల్ ఫ్రండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **జటాధర** : శారదా, శ్రీకన్య
- **బ్యాడ్ ల్యాండ్స్ / ఫినిక్స్** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : వెంకటేశ్వర-1.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 30, వంకాయలు (తెలుపు) 58, వంకాయలు (నలుపు) 66, బెండకాయలు 58, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 54, బీరకాయలు 56, ఆనపకాయ 42, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 58, దొండకాయలు 60, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 64, బరబాటి 50, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 42, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 34, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 36, కంద 46, దేముడుచిక్కుడు 74, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	590
విజయనగరం	594
శ్రీకాకుళం	594

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

సచివాలయాల్లో సిబ్బంది ఇష్టారాజ్యం



గోపాలపట్నం : నాగేంద్రకాలనీ సచివాలయం



పెందుర్తి : విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు



మల్కాపురం : ఒక్కరే విధుల్లో ఉన్న దృశ్యం

- కొన్నిచోట్ల సిబ్బంది కొరత
- మరికొన్నిచోట్ల అదనపు ఉద్యోగులు
- సమయపాలన పట్టని వైనం
- పని చేయని కంప్యూటర్లు

గోపాలపట్నం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల సచివాలయ ఉద్యోగుల బదిలీ తరువాత రీగ్రూపింగ్ చేసి క్లస్టర్‌లుగా విభజించారు. దాదాపు అన్ని సచివాలయాల్లో 8 మంది సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్నారు. ముఖ్యంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి వీఆర్‌వోలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో రెండు సచివాలయాలకు ఒకరే వీఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. సచివాలయంలో విధులు నిర్వహించే సిబ్బందిలో సగం మంది బయటే విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన సగం మంది సచివాలయంలో అందుబాటులో ఉంటున్నారు.

సర్వేలకే ఎక్కువ సమయం

ప్రతి సచివాలయంలో సిబ్బంది తమ సగం సమయాన్ని సర్వేలకే కేటాయిస్తున్నట్టు తెలుస్తోంది. సర్వేలు నిర్వహించే సమయంలో ప్రజలు అందుబాటులో ఉండక పోవడం, ఇతర కారణాల వల్ల సర్వేల్లో జాప్యమవుతోందని సబ్బంది వాపోతున్నారు.

సిబ్బంది కొరతతో విధుల్లో ఒత్తిడి

కూర్మన్నపాలెం : వడ్లపూడి-1, 2, గణేశ్ నగర్, కణితి, డాక్‌యార్డు కాలనీల్లో ఉన్న సచివాలయాల్లో



వడ్లపూడి-1 సచివాలయంలో పని చేస్తున్న సిబ్బంది

సిబ్బంది సమయానికి విధులకు హాజరైయారు. పలువురు మహిళా పోలీసులు శివాలయాల వద్ద ఉదయం 5 గంటలకు విధులకు హాజరైయారు. ప్రస్తుతం 'సచివాలయం 'సేవలు సంతృప్తికరం' సర్వేలతో సిబ్బంది బిజీబిజీగా ఉన్నారు. ప్రతి సచివాలయంలో 6 నుంచి 8 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉదయం ముగ్గురు, సాయంత్రం ముగ్గురు సిబ్బంది తమకు కేటాయించిన క్లస్టర్లలో సర్వేలు చేస్తున్నారు. సచివాలయాల్లో సిబ్బంది కొరత కారణంగా విధుల్లో ఒత్తిడి ఎక్కువగా ఉన్నదని పలువురు సిబ్బంది వాపోతున్నారు. ఒక్కో సచివాలయంలో ఇద్దరు నుంచి ముగ్గురు సిబ్బంది తక్కువగా ఉన్నారు. ప్రస్తుతం ఒక్కో ఉద్యోగి 80 నుంచి 100 ఇళ్ల వరకూ సర్వే చేయాల్సి వస్తోంది. సర్వే చేస్తున్న సమయంలో ఓటీపీలు చెప్పేందుకు ప్రజలు నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు.

సర్వేలతో బిజీబిజీ

మల్కాపురం: సచివాలయాల ఉద్యోగులకు సర్వేల కోసం ఒక్కొక్కరికి రెండు నుంచి నాలుగు క్లస్టర్లు అప్పగించడంతో పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నదని ఆయా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ములగాడ మండలం పరిధి 31 సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయానికి 10 మంది ఉద్యోగులు ఉండగా రీగ్రూపింగ్ తరువాత 5 నుంచి 7 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. ప్రస్తుతం సచివాలయం అడ్మిన్‌లుగా ఉన్నవారికి వారి విధులతో పాటు రీగ్రూపింగ్ తరువాత పక్క సచివాలయానికి అడ్మిన్ బాధ్యతలు కూడా అప్పగించారు. కొన్నిచోట్ల వెల్ఫేర్ సెక్రటరీలకు అడ్మిన్ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఒకే వ్యక్తి అన్ని చోట్ల విధులు నిర్వహించడం కష్టంగా ఉన్నదని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు.

కొంతమందికే పని

పెందుర్తి: పెందుర్తి పరిధిలో ఉన్న 45 సచివాలయాలను 23 క్లస్టర్లుగా విభజించడంతో సుమారు 339 మంది ఉద్యోగులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రీగ్రూపింగ్ అనంతరం సచివాలయంలో కొందరికి పనిభారం అధికంగా ఉన్నా మరి కొందరికి మాత్రం పూర్తి స్థాయిలో పనిలేదు. ఈ నేపథ్యంలో పెందుర్తిలో ఉన్న క్లస్టర్ 518, 519 సచివాలయాలను పరిశీలించగా, అందులో వీఆర్‌వోకు అధికంగా పని భారం కనిపించింది. పలువురు ఉద్యోగులు ఫీల్డ్ వర్క్‌లోనే విధులు నిర్వహిస్తున్నారు. మరి కొందరు సచివాలయంలోనే అందుబాటులో ఉంటున్నారు.

టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ఇటీవల ఏర్పాటు చేసిన వార్డు క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జి, బూత్ కన్వీనర్ కమిటీల ప్రమాణస్వీకారం బుధవారం జరిగింది. పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా కమిటీల సభ్యులతో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పెట్టుబడుల సదస్సుతో నగరం అభివృద్ధి

నగరంలో జరగనున్న పెట్టబడుల సదస్సుతో విశాఖ అభివృద్ధి పథంలో దూసుకుపోవడంతో పాటు రాష్ట్ర ఆర్థిక రాజధానిగా సుస్థిర స్థానం సంపాదించుకుంటుందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ భాగస్వామ్య సదస్సుకు విదేశాల నుంచి సుమారు 200 మంది సంస్థల సీఈవోలు హాజర వుతారని, ఈ సదస్సు ద్వారా లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నట్టు పేర్కొన్నారు. పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలోని యువతకు మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నరు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని అన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠి గోడపత్రికావిష్కరణ

స్థానిక ప్రశాంతినగర్‌లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో 26న సుబ్రహ్మణ్య షష్ఠి నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో షష్ఠి గోడపత్రికను గ్రామ పెద్దలతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ నెల 25న స్వామివారికి మంగళస్నానం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 26న స్వామివారి కల్యాణం, అన్నసమారాధన, ఊరేగింపు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

జిల్లా బీసీ, ఓబీసీ ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా పాండ్రంగి

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డుకు చెందిన పాండ్రంగి రుక్మాకరరావు ఉమ్మడి విశాఖ జిల్లా బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు రాష్ట్ర ఉద్యోగుల సంఘం కార్యవర్గం సమావేశంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే కోచింగ్, క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు బాక్సింగ్ కోచ్, ఇతరులతో మాట్లాడి పిల్లలకు మేలు జరిగేలా కృషి చేస్తానని అన్నారు.

మాట తప్పడం, మడమ తిప్పడం జగన్ నైజం

- మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి



మీడియాతో మాట్లాడుతున్న ఉండవల్లి శ్రీదేవి

ఎంవీపీ కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో అణగారిన వర్గాలకు చేసిందేమీ లేదని మాదిగ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి విమర్శించారు. ఎంవీపీ కాలనీలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్ పాలనలో కార్పొరేషన్ డైరెక్టర్లకు జీతాలు కూడా ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వంలో రెండో తేదీన ఠంచనుగా జీతాలు వస్తున్నాయన్నారు. మాట తప్పడం, మడమ తిప్పడం జగన్ నైజమన్నారు. దళితులను చంపిన వారికి మద్దతు ఇచ్చే జగన్ వారికి ఏదో చేస్తారని ఆశించడం అత్యాశ అవుతుందన్నారు. మాస్క్ అడిగితే చంపేస్తారు. మద్యం, ఇసుక కుంభకోణంపై మాట్లాడితే దాడులు చేశారు. అక్రమాలను ప్రశ్నించిన దళితులకు మేనమామగా ఉంటానన్న జగన్, దళితులను చంపిన వారికి మాత్రమే అండగా ఉన్నారన్నారు. ఎస్సీలపైనే అట్రాసిటీ కేసులు పెట్టించిన ఘనత అతనిదన్నారు. అమరావతిని నాశం చేశారని, సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారన్నారు. కూటమి హయంలో డీఎస్సీ ఎంత పారదర్శకంగా జరిగిందో అందరికీ తెలిసిందేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హయంలో సంక్షేమ పథకాలు విజయవంతంగా సాగుతున్నాయన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందిస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు

వేపగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు . వేపగుంట కమ్యూనిటీహాల్‌లో పీఎంఏవై పథకం కింద లబ్ధిదారులకు ఇంటితాళాలు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ గత ప్రభుత్వ హయాంలో అంతా అరాచకమే జరితే, నే డు అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందన్నారు. సంక్షేమం తో పాటు అభివృద్ధి చేయగల నాయకుడు చంద్రబాబు అని ఆయన కొనియాడారు. సొం త ఇంటిస్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదా రులు నియోజక వర్గంలో 2000 మంది ఉంటే, కేవలం 94వ వార్డులోనే 200 మంది ఉన్నార ని వెల్లడించారు. అంతకముందు ముత్యాలమ్మ కాలనీలో గృహనిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

రైతులకు న్యాయం చేస్తాం

పెందుర్తి: అభివృద్ధి ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఏళ్లతరబడి ఆభూముల్లో సాగు చేసుకుంటున్న రైతులు ఉపాధి కోల్పోతామని ఆందోళన వ్యక్తపరుస్తు తమకు న్యాయం చేయాలని బుధవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును తన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ నరవలో ల్యాండ్‌బ్యాంకు ప్రతిపాదించిన భూముల్లో సాగు చేస్తున్న రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలే టీడీపీకి వెన్నెముక అని, ప్రభుత్వ విజయాలని ప్రజల్లోకి తీసు కువెళ్లాల్సిన బాధ్యత వారిపై ఉన్నదని టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారా యణ అన్నారు. బుధవారం వార్డులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీల వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని, కార్యకర్తలు ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానిక కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించనున్న వార్డు కమిటీ ప్రమాణ స్వీకారానికి అందరూ రావాలని కోరారు. భాగస్వామ్య సదస్సు, గూగుల్ డేటా సెంటర్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

విశాఖ ఇంజనీరింగ్ కళాశాలకు రీసెర్చ్ సెంటర్ మంజూరు

గోపాలపట్నం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల(అటానమస్)కు జేఎన్‌టీయూజీవీ రీసర్చ్ సెంటర్‌ను మంజూరు చేయడం పట్ల కళాశాల ఛైర్మన్ జి.సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాలకు రీసెర్చ్ సెంటర్ అనుమతి లభించడం వల్ల కళాశాలలో పరిశోధనలు జరుగుతున్నాయని అన్నారు. ఎంటెక్ పూర్తి చేసిన విద్యార్థులు కళాశాలలో అందుబాటులో ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయా విభాగిధిపతులకు రీసెర్చ్ సెంటర్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడా పోటీలు



పతకాలు అందిస్తున్న టీసీఆర్‌టీఎం ఈడీ డాక్టర్ రాణిమందా

సాగర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా సంస్థలో జన జాతీయ గౌరవ్ దివస్ (జేజేజీడీ) 2025 ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి గిరిజన పోటీలు బుధవారంతో ముగిసాయి. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లోని విజేతలకు ఆ సం స్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణి మం దా బహుమతులు ప్రదానం చేశారు. కబడ్డీలో బాలురు, బాలికల విభాగంలో చింతూరు ఐటీ డీఏ, వాలీబాల్ (బాలురు) పోటీల్లో పార్వతీపురం మన్యం జిల్లా, బాలికల విభాగంలో విజయనగరం జిల్లా సీతంపేట విజేతలుగా నిలిచాయి. అలాగే జావెలిన్‌త్రో బాలురు, బాలికల విభాగంలో పాడేరు, ఆర్చరీ బాలుర విభాగంలో పాడేరు, బాలికల విభాగంలో సీతంపేట విజయం సాధించాయి. వక్తృత్వ పోటీలో సీతంపేట, చిత్రలేఖనంలో కేఆర్‌పురం గెలుపొందాయి.

'నైపుణ్యంతోనే ఉత్తమ ఫలితాలు'

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బిర్సాముండ 150వ జయంతి సందర్భంగా కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సహకారంతో, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లాంట్ హెచ్‌ఆర్‌డీ భవనంలో 'ఎన్విరాన్మెంట్ సస్టెనిబిలిటీ, ఎడ్యూకేషన్ స్కిల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకాలజిస్ట్ ముత్యాల బాలాజీ నైపుణ్యత, నాయకత్వ లక్షణాలపై ప్రసంగించారు. పని ప్రదేశంలో నైపుణ్యంతో విధులు నిర్వహిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు.



వర్క్ ప్రొసీడింగ్స్ అందిస్తున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పేదవాళ్లకి సొంత ఇంటి కల నెరవేర్చడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక జోనల్ కార్యాలయంలో బుధవారం ఇళ్ల లబ్ధిదారులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఎంపికైన వారికి రూ.2.5లక్షల వలువైన వర్క్ ప్రొసీడింగ్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 50 వేల మంది లబ్ధిదారులు ఈ పథకానికి ఎంపికయ్యారు. విశాఖ జిల్లాలో 2,800మందికి ఉండగా, గాజువాకలో 1,343మంది లబ్ధిదారులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. గాజువాక లబ్ధిదారులకు రూ.335 కోట్లు కేటాయింపులు జరిగాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ గౌరవంగా జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్ద పీట

అగనంపూడి: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఫార్మాసిటీలోని ఉన్న లుపిన్ ఫార్మా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో రూ. 9 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపీ వెయిటింగ్‌హాలును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్ పేషెంట్లు ఉండేందుకు వెయిటింగ్ హాలు ఏర్పాటుతో పాటు కుర్చీలు, ఫ్యాన్లు, టీవీ వంటి సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. లుపిన్ ఫార్మా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. వైద్యం, ఆరోగ్య విషయాల్లో సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, ఇల్లపు వరలక్ష్మి, లుపిన్ ఫార్మా హెడ్ ఎంప్లాయీస్ విక్టర్, వైద్య విధాన పరిషత్ జిల్లా కో- ఆర్డినేటర్ శంకర ప్రసాద్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించండి

రోగులకు మెరుగైన సేవలు అందించే విధంగా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచించారు. ఆస్పత్రి కమిటీ ప్రతినిధులు, వైద్యులు, సిబ్బందితో బుధవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రూ.2 లక్షలు విలువ చేసే గైనిక్, ఆర్థో, ఈఎన్‌టీ వైద్య పరికరాల కొనుగోలు తీర్మానం చేశారు. అలాగే మంచినీటి మోటారు కొనుగోలు, ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించడానికి తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలకు ఏర్పాట్లు

పెదగంట్యాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కేంద్రంగా నిర్వహించనున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రారం నుంచి ఈనెల 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వాహణకు షెడ్యూల్ రూపొందించారు. ఈ సందర్భంగా శుక్రవారం నెహ్రూ జయంతి, శనివారం పుస్తకప్రదర్శన, చిత్రలేఖనం పోటీలు, ఆదివారం కవిసమ్మేళనం, విద్యార్థులకు మ్యూజికల్ చైర్, పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. సోమవారం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖలకు నివాళులు అర్పించడం, వ్యాసరచన పోటీలు, మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే ఈ నెల 18న క్విజ్ పోటీలు, 19న భారతమాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతోత్సవాలు, బాలికలకు ముగ్గుల పోటీలు ఉంటాయని, 20న జాతీయ గ్రంథాలవారోత్సవాల ముగింపు సభ, వివిధ అంశాల పోటీల్లోని విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని వెల్లడించారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ పరిధిలోని విద్యార్థులు, రచయితలు, కవులు ఈ కార్యక్రమంలో పాల్గొవాలని పీవీ రమణ కోరారు.

షిప్‌యార్డ్ న్యూకాలనీలో..

సింధియా: ఈ నెల 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు, పాఠకులు పాల్గొవాలని గ్రంథాలయాధికారి బి.కనకరాజు పిలుపునిచ్చారు. 40వ వార్డు హిందుస్థాన్ షిప్‌యార్డ్ న్యూకోలనీలో ఉన్న గాంధీగ్రామ్ శాఖ గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లడుతూ సింధియా పరిసర ప్రాంతంలో ఉన్న ఉపాధ్యాయులు విద్యార్థులకు గ్రంథాలయం పట్ల అవగాహన కల్పించి వారోత్సవాలకు పంపాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- గాజువాక ఎంఈవో సునీత

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని గాజువాక మండల విద్యాశాఖాధికారి ఎం. సునీత అన్నారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులను ఆమె అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో 'ఉక్కు' ఉద్యోగులకు పెండింగ్ జీతాలు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగుల పెండింగ్ జీతాలు డిసెంబరులో చెల్లించడానికి లేబర్ కమిషనర్ అంగీకారం తెలిపిందని గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎస్.రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీతాలు చెల్లించే విధంగా పలుమార్లు వినతి పత్రాలు అందజేశామని, ఈ క్రమంలో యాజమాన్యంతో చర్చించిందని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన

ఎన్ఏడీ జంక్షన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బుచ్చిరాజుపాలెం బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాధారులకు బ్యాంక్ ప్రతినిధులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్లు ఖాతాదారులను ఏవిధంగా బురిడి కొట్టిస్తారు, అదేవిధంగా ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయకూడదని, ఫైనాన్షియల్ విషయాలు నేరుగా బ్యాంకుకు వచ్చి తెలుసుకోవాలని, ఓటీపీ నంబర్లు ఇతరులకు చెప్పవద్దని, బ్యాంక్ పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

సింధియా, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63వ వార్డు చింతలలోవ టీడీపీ కార్యాలయంలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్య ంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో రక్తపోటు, మధుమేహం వంటి పరీక్షలు చేస్తున్నారని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కార్పొరేటర్ గల్లా పొలిపల్లి (చిన్నా) అన్నారు. ఈ వైద్య శిబిరంలో పరీక్షలు చేయి ంచుకున్నావారికి మందులు పంపిణీ చేశా రు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల సంక్షేమానికి, ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇంటక్ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డిని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ నాయకులు నీరుకొండ రామచంద్రరావు కోరారు. బుధవారం హైదరాబాద్‌లో యూనియన్ జాతీయ అధ్యక్షుడుని కలిసి పలు అంశాలను విన్నవించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన

మల్కాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పారిశ్రామిక ప్రాంతం గాజువాక ఆర్టీసీ డిపో వద్ద వైసీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయప్రసాద్, చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు.ఇప్పటికే కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. తొలుత గాజువాక ఆర్టీసీ డిపో నుంచి ములగాడ తహశీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతి పత్రం అందజేశారు.



పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొనేందుకు నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విమానాశ్రయంలో స్వాగత పలుకుతున్న మంత్రి వంగలపూడి అనిత, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, కలెక్టర్ హరేంధిరప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎంపీలు శ్రీభరత్, సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బండారు, వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, తదితరులు

పసికందును చంపేశారయ్యా!

» చికిత్సలో నిర్లక్ష్యంపై పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన దంపతుల ఆక్రోశం

» కేజీహెచ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు

» మృతదేహంతో తిరుగుపయనం



కుమారుడి మృతదేహాన్ని భుజాన వేసుకుని దుఃఖంతో తిరిగి వెళ్తున్న తల్లిదండ్రులు

మహారాణిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలల పసికందుకు జ్వరం నయమవుతుందనే గంపెడాశతో కేజీహెచ్‌కు వచ్చిన ఆ గిరిజన దంపతులు విగతజీవిగా మారిన కుమారుడ్ని భుజాన వేసుకుని తిరిగి వెళ్తున్న దృశ్యం చూపరులను కదిలించింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు కన్నుమూశాడని ఆరోపించారు. న్యాయం జరిగే వరకు వెళ్లేది లేదని, మరొకరికి ఇలాంటి బాధ రాకూడదని మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నిరాకరించారు. అధికారులు సర్దిచెప్పడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి తిరుగు ప్రయాణమయ్యారు. బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పసికందు తండ్రి ఎప్పరి అఖిల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం వంగర గ్రామంలో ధన్‌వీర్ (5 నెలలు) ఈ నెల 8న జ్వర లక్షణాలతో అనారోగ్యానికి గురయ్యాడు. స్థానికంగా ఆస్పత్రికి తీసుకువెళ్లగా రక్తంలో ఇన్‌ఫెక్షన్ ఉందని, మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తీసుకెళ్లాలని చెప్పడంతో అదే రోజు రాత్రి పిల్లల వార్డులో చేర్పించారు. రెండు రోజులు చికిత్స తరువాత ధన్‌వీర్ కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. అయితే మంగళవారం రాత్రి నుంచి పసికందుకు ఇంజక్షన్ ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులు వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. అయినా వారు సరిగా స్పందించకపోవడంతో బుధవారం ఉదయం 8 గంటల సమయంలో బాలుడు కన్నుమూశాడు. పిల్లల వైద్య విభాగంలోని వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందంటూ వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. వైద్య సిబ్బందికి కౌన్సెలింగ్ ఇస్తామని మాత్రమే తమకు చెప్పారని, తమకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదని ఆ బాలుడి తల్లిదండ్రులు వాపోయారు. అనంతరం తీవ్రంగా రోదిస్తూ అంబులెన్స్‌లో కుమారుడి మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువెళ్లారు. వీరి ఆరోపణపై ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరిని ప్రశ్నించగా బాలుడి తండ్రి ఫిర్యాదు అందిన తరువాత వైద్యుల వివరణ కోరినట్టు తెలిపారు.

డబుల్ డెక్కర్ బస్సు ముస్తాబు



సాగర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భాగస్వామ్య సదస్సుకు ఓపెన్ టాప్ డబుల్ డెక్కర్ బస్సును సుందరంగా ముస్తాబు చేశారు. నగరాభివృద్ధిని తెలియ జేసేవిధంగా పలు స్టిక్కరింగ్, కళాకృతులతో ఆకర్షణీయంగా తీర్చి దిద్దారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులను తీసుకువచ్చేందుకు గురువారం 10 గంటలకు ఈ బస్సు నోవాటెల్ నుంచి బయలుదేరనుంది. దేశ, విదేశీ ప్రతి నిధులు ఈ బస్సుపై సాగర్‌నగర్, రుషికొండ బీచ్ మీదుగా తొట్లకొండ, భీమిలి వరకు విహరించనున్నట్టు అధికారులు తెలిపారు.

బోల్తాపడిన కంటైనర్

» మూడు కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు



క్రేన్ల సాయంతో కంటైనర్‌ను తొలగిస్తున్న పోలీసులు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై షీలానగర్ సిగ్నల్ పాయింట్ వద్ద బుధవారం వేకువ జామున కంటైనర్ బోల్తా పడింది. దీంతో మూడు కిలో మీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అచ్యుతాపురం నుంచి పాల్ సీలింగ్ మెటీరియల్ లోడ్‌తో భారీ కంటైనర్‌ను విశాఖ పోర్టుకు తరలిస్తుండగా ట్రైలర్ షీలానగర్ సిగ్నల్ పాయింట్ వద్ద పోర్టు రోడ్డు వైపు మలుపు తిరుగుతుండగా అదుపు తప్పింది. దీంతో కంటైనర్ రహదారి మధ్యలో బోల్తా పడింది. దీంతో ఎన్ఏడీ నుంచి గాజువాక వైపు వాహనాలతో పాటు గాజువాక నుంచి పోర్టు రోడ్డులోకి వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నాలుగు క్రేన్‌ల సహాయంతో కంటైనర్‌ను తొలగించేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించారు.

సదస్సుకు సర్వం సిద్ధం

ఈనెల 14, 15 తేదీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సుకు సర్వం సిద్ధమయింది. ఇప్పటికే ప్రధాన వేదికతో పాటు, అతిథులు, ఇతర ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యేందుకు గదులను సిద్ధం చేశారు. ఆధునిక హంగులతో, సకల సౌకర్యాలతో సదస్సుకు భారీ ఏర్పాట్లు చేశారు. ప్యాలెస్‌ను తలపించేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. వేలాదిమంది హాజరయ్యే అవకాశం ఉండడంతో అందుకు తగ్గ సీటింగ్ ఎరేంజ్‌మెంట్స్ చేశారు. జిగేల్‌మనేలా వేదికలు, గదులు, డైనింగ్ హాల్స్ రూపుదిద్దారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



సదస్సులో పోలీసుల బందోబస్తు



ప్రతినిధుల కోసం సిద్ధం చేసిన వాహనాలు



భాగస్వామ్య సదస్సుకోసం భారీ ఏర్పాట్లు



ప్రతినిధులతో సమావేశమయ్యేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక గది



ప్రతినిధుల రాకపోకలకు సిద్ధం చేసిన బ్యాటరీ వాహనాలు



ప్రధాన వేదికపై సిద్ధమైన డిజిటల్ స్క్రీన్

బీచ్‌రోడ్డులో సందడిగా యూనిటీ మార్చ్



ర్యాలీలో ఎంపీ శ్రీభరత్, గాజువాక, ఉత్తర ఎమ్మెల్యేలు పల్లా, విష్ణుకుమార్‌రాజు, తదితరులు

బీచ్ రోడ్డు, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి): ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ యువతకు స్ఫూర్తి ప్రదాత అని విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. పటేల్ 150వ జయంతి సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఆర్కే బీచ్ వద్ద యూనిటీ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక భారత దేశాన్ని నిర్మించిన మహా నాయకుల్లో పటేల్ ఒకరన్నారు. దేశ విభజన పరిస్థితుల్లో ఆయన కృషి మరువలేనిదన్నారు. దేశ సమైక్యత కోసం దృఢంగా నిలబడిన తీరు, ఉక్కు సంకల్పంతో దేశాన్ని ఏకం చేసిన వైనం ముదావహమన్నారు. సమైక్య భారత నిర్మాతగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో 560 సంస్థానాలను విలీనంచేసిన ఘనత పటేల్‌కే దక్కుతుందన్నారు. ఆయన ఆశయ సాధనకు యువత నడుం కట్టాన్నారు. గుజరాత్‌లో ప్రపంచంలో అత్యంత ఎత్తైన పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ జునాగఢ్, హైదరాబాద్, లక్ష దీవులను భారత్‌లో కలిపేందుకు పటేల్ చేసిన ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయన్నారు. దేశం కోసం ఎంతో పోరాటం చేసినప్పటికీ ఆయనకు భారతరత్న దక్కలేదన్నారు. అనంతరం ఆర్కే బీచ్ కాళికామాత ఆలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ బీవీ రమణమూర్తి, లీలాప్రసాద్, ఉమ్మిడి సుజాత, జి.మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతానికి కృషి

» ఏఎంసీ కల్చరల్ ఫెస్ట్‌లో మంత్రి దోలా శ్రీబాల వీరాంజనేయస్వామి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, అధికారులు

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోల శ్రీబాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఆంధ్ర మెడికల్ కళాశాల ఆవరణలో బుధవారం అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ, కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ పేదల కోసం ఉచితంగా రూ.25 లక్షల హెల్త్ పాలసీని తీసుకువచ్చామన్నారు. సంజీవని పథకంతో ప్రజలందరి ఆరోగ్య వివరాలను డిజిటలైజేషన్ చేస్తున్నట్టు తెలిపారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం వల్ల పేదలకు మేలు జరుగుతుందన్నారు. పేద విద్యార్థులకు లభించే మెడికల్ సీట్ల సంఖ్య పెరుగుతుందని, కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందన్నారు. తాను ఇదే కాలేజీలో చదువుకున్నానని, ముఖ్య అతిథిగా రావడం గర్వంగా ఉందన్నారు. తనకు సీఎం చంద్రబాబు వల్లే గౌరవం దక్కిందన్నారు. వైద్య వృత్తి పవిత్రమైనదని, పేదలకు సేవలు అందించేందుకు కృషిచేయాలని సూచించారు. రూ.8 కోట్లతో కేజీహెచ్‌లో భవనం నిర్మిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏఎంసీ ప్రిన్సిపల్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, సెంటినరీ అకడమిక్ బ్లాక్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులు దాడిచేస్తే...!

» అప్పన్న ఆలయంలో మాక్ డ్రిల్ నిర్వహించిన ఆక్టోపస్ బలగాలు

సింహాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంపై మంగళవారం రాత్రి ఉగ్రమూకల దాడి జరిగింది. రాష్ట్రానికి చెందిన ప్రత్యేక పోలీసు విభాగం ఆక్టోపస్ బలగాలు దానిని సమర్థంగా ఎదుర్కొని ఆలయాన్ని రక్షించడంలో సఫలీకృతమయ్యాయి. అది అంతా నిజమేననుకుని పలువురు ఆందోళన చెందారు. అసలు విషయం పరిశీలిస్తే ఆలయంపై ఉగ్రదాడి జరిగితే ఎలా ఎదుర్కోవాలో ప్రత్యక్షంగా చూపించేందుకు నిర్వహించిన మాక్‌డ్రిల్‌గా నిర్ధారించుకుని ఊపిరి పీల్చుకున్నారు. దేవాలయ అధికారులు అందజేసిన సమాచారం ప్రకారం ... ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడు ఘటన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆక్టోపస్ డీఎస్పీ తిరుపతయ్య తమ బలగాలతో పాటు గోపాలపట్నం పోలీసులు, దేవస్థానం ఎస్‌పీఎఫ్, ప్రవేటు సెక్యూరిటీ గార్డులతో కలిసి మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రధాన ఆలయంలోకి ఉగ్రమూకలు సాయుధులై ప్రవేశించినట్టు, కొన్ని చోట్ల బాంబులు అమర్చినట్టు ఆవిష్కరించారు. అదే సమయంలో కొందరు గార్డులు, ఆక్టోపస్ బలగాలు స్వల్పంగా గాయపడగా, వారికి అప్పటికప్పుడే ప్రాథమిక చికిత్స చేసి రక్షించిన విధానాలను కళ్లకు కట్టినట్టు చూపారు. మాక్‌డ్రిల్‌లో ఎస్‌పీఎఫ్, అగ్నిమాపక దళం, రెవెన్యూ, వైద్య, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఆక్టోపస్ అధికారి



గాయపడిన కమెండోకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం



ఆలయంలో అమర్చిన బాంబును పరిశీలిస్తున్న దృశ్యం



రాజగోపురం వద్ద మోహరించిన సాయుధబలగాలు

డాక్‌యార్డు వంతెనపై వాహన రాకపోకలు

» ప్రారంభమైన సర్దార్ వల్లభాయ్ పటేల్ బ్రిడ్జి

మల్కాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేవల్ డాక్‌యార్డు సమీపంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతనపై బుధవారం ఉదయం 5 గంటల నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు, ఆటో, కార్లను మాత్రమే అనుమతించారు. బ్రిడ్జి పునర్నిర్మాణం నిమిత్తం మూసివేసిన 15 నెలల అనంతరం తిరిగి ప్రారంభం కావడంతో పారిశ్రామిక ప్రాంత వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి నుంచి నగరానికి చేరుకునేందుకు వంతెన పైనుంచి ఎస్ఆర్ కంపెనీ, కాన్వెంట్ కూడలికి మీదుగా ప్రయాణించాలి. నగరం నుంచి వచ్చే వారు జ్ఞానాపురం మార్గంలోకి చేరుకొని రామ్మూర్తి పంతుల పేటకు సమీపంలో డాక్‌యార్డు క్వార్టర్స్ మార్గంలో వంతెన కింద నుంచి హెచ్‌పీ పెట్రోల్ బంక్, అక్కడి నుంచి వంతెన మీదుగా చేరుకుంటున్నారు. కాగా వంతెన సమీపంలోని షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ) వద్ద భారీగా దుమ్ము రేగుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఇబ్బందులు పడుతున్నారు. సాగరమాల పథకంలో భాగంగా కాన్వెంట్ నుంచి డాక్‌యార్డుకు వెళ్లే మార్గంలో ప్రస్తుతం పోర్టు రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ వంతెను అందుబాటులోకి వస్తే బస్సుల రాకపోకలను పునరుద్ధరించే అవకాశం ఉంటుంది.



వంతనపై నుంచి వాహనాలు వెళ్తున్న దృశ్యం